




అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి

- అభివృద్ధి, సంక్షేమపథకాలు ప్రజలకు అందాలి
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మం, జనవరి 21(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని, సమన్వయంతో అభివృద్ధి పనులను నిత్యం పర్యవేక్షించాలని, రెవెన్యూ, హౌసింగ్, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజలకు సకాలంలో అందాలని సూచించారు. ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదివారం కలెక్టర్ వీపీ గౌతమ్‌తో కలిసి పాలేరు నియోజకవర్గం అభివృద్ధి పనుల పురోగతిపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు జవాబుదారీతనంతో పనిచేయాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించి ప్రభుత్వ వ్యవస్థలపై విశ్వాసాన్ని కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండాలన్నారు. తాను నిత్యం ప్రజల్లో ఉంటూ క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేస్తానని, నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మార్చి నెలాఖరులోగా అన్ని హెల్త్ సబ్ సెంటర్ల భవనాలను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. మూతపడిన పాఠశాలలను పునఃప్రారంభించడానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మండల విద్యాధికారుల ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలని సూచించారు. తిరుమలాయపాలెం కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ 30 పడకల నుంచి 100 పడకలకు అప్‌గ్రేడ్ అయ్యిందని దీనికి అనుగుణంగా భవనాల నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలన్నారు. నేలకొండపల్లి కమ్యూనిటీ సెంటర్ ఆపరేషన్ థియేటర్, కాంపౌండ్‌వాల్ నిర్మాణం పనులను పూర్తి చేయాలన్నారు. కూసుమంచిలో ఆయూష్ భవనం నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు, టెండర్ ప్రక్రియలో ఉన్న చెక్‌డ్యాం పనుల వివరాలను అందించాలన్నారు. పాలేరు కెనాల్ మెయిన్ అప్‌స్ట్రీమ్, డౌన్‌స్ట్రీమ్‌లో ఉన్న భూములను డీమార్క్ చేసి పెన్సింగ్ చేపట్టాలని అధికారులకు సూచించారు. నాయకన్‌గూడెంలో ఐబీ విశ్రాంతి గృహనిర్మాణానికి టెండర్ రీకాల్ చేయాలన్నారు. ఎన్నెస్పీ, ఎస్సారెస్పీ మంజూరు పనుల వివరాలను కూడా మంత్రి అడిగి తెలుసుకున్నారు. మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణం పనుల వివరాలు కూడా మంత్రి అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఎత్తిపోతల పథకాలను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. గ్రామాల్లో వేలాడే విద్యుత్ తీగలను సరిచేయాలన్నారు. పాలేరు నియోజకవర్గానికి మంజూరైన మిని స్టేడియం నిర్మాణం పనులను తక్షణమే ప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. మద్దులపల్లి మార్కెట్ నిర్మాణం పనులు జూలై నాటికి పూర్తి చేయాలని, గిరిజన సంక్షేమ శాఖ ద్వారా చేపట్టిన పనుల్లో మరింత వేగం పెంచాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు బి సత్యప్రసాద్, డి మధుసూదన్‌నాయక్, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణ కలెక్టర్ మయాంక్ సింగ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భద్రాద్రికి అయోధ్య.. ప్రతిష్ఠోత్సవ శోభ



భద్రాచలంలో శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం



అయోధ్యలో బాలరాముడి విగ్రహం



- పుష్పాలతో సుందరంగా రామాలయ ప్రాంగణం అలంకరణ
- శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో నేడు ప్రత్యేక పూజలు
- ఉదయం నుంచి భక్తులకు బెల్లంపొంగలి ప్రసాద వితరణ
- ఆదివారం రామయ్యను దర్శించుకున్న 10వేల మంది భక్తులు

భద్రాచలం, జనవరి 21: అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ సోమవారం నిర్వహించనున్న నేపథ్యంలో దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచల పుణ్యక్షేత్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం శోభాయమానంగా ముస్తాబైంది. రంగురంగుల పూలతో ఆలయ ప్రవేశమార్గం, రాజగోపురం పరిసరాలను అందంగా తీర్చిదిద్దారు. ఈ పుష్పాలంకరణకు రూ.2లక్షలు వెచ్చించగా ఈ మొత్తాన్ని పరాశక్తి సిమెంట్స్ యాజమాన్యం అందించింది. అయోధ్య ప్రతిష్ఠ నేపథ్యంలో భద్రాద్రిలో నేడు ఉదయం 7నుంచి 7.30 వరకు నిత్యకల్యాణ మండపం వద్ద సువర్ణ పుష్పార్చన నిర్వహించనున్నారు. 7గంటల నుంచి 10.30 వరకు ప్రచారరథంతో శోభాయాత్ర నిర్వహిస్తారు. ఉదయం 10నుంచి 11గంటల వరకు ఆలయంలో సంక్షేప రామాయణ హవనం, సాయంత్రం 4నుంచి 5.30 వరకు సుందరాకాండ పారాయణం చేస్తారు. సాయంత్రం 5.30 నుంచి ఆలయ ప్రాంగణంలో దీపోత్సవం నిర్వహించనున్నారు. ఉదయం ఏడు నుంచి సాయంత్రం 6 గంటల వరకు వచ్చే భక్తులకు బెల్లంపొంగలి ప్రసాద వితరణ చేయనున్నారు. అయోధ్య ఆలయ ప్రతిష్ఠ నేపథ్యంలో భద్రాద్రి రామాలయంలో ఆ ఉత్సవ శోభను ఇనుమడింపజేసేలా సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నారు.

రామయ్యను దర్శించుకున్న పదివేల మంది భక్తులు

భద్రాద్రి రామాలయం ఆదివారం భక్తజన సందోహంగా మారింది.



సుమారు పదివేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. నిత్యకల్యాణ కార్యక్రమంలో 105 జంటలు పాల్గొనగా, అంతరాలయంలో జరిగిన ఆర్జిత అభిషేకంలో 52 మంది భక్తులు పాల్గొన్నారు. ఆదివారం భద్రాద్రి దేవస్థానానికి రూ.12,49,023 ఆదాయం సమకూరింది. ఇందులో ప్రసాదాల ద్వారా రూ.4,77,820, అభిషేకాలు, పూజలు, కల్యాణాల ద్వారా రూ.5,67,355 ఆదాయం వచ్చింది.

సంప్రదాయబద్ధంగా శోభాయాత్ర

భద్రాచలంలోని రాజవీధిలో ఉన్న శ్రీ భద్ర శ్రీ ఆరాధన పీఠం, శ్రీరామ చరణ సేవా తరంగిణీల సంయుక్తఆధ్వర్యంలో రామచంద్రమూర్తికి శోభాయాత్రను నిర్వహించారు. భక్తుల కోలాటాలు, మేళతాళాల నడుమ స్వామివారికి శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, దేవస్థానం స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ఉప ప్రధాన అర్చకులు కోటి రామస్వరూప్ రాఘవాచార్య, ముఖ్య అర్చకులు కారంపూడి కిరణ్‌కుమారాచార్యులు, కోటి విష్ణువర్ధనాచార్యులు, అర్చకులు సౌమిత్రి శ్రీనివాసాచార్యులు, జీయర్‌మఠం నిర్వాహకులు గట్టు వెంకటాచార్య, అధిక సంఖ్యలో మహిళ భక్తులు పాల్గొన్నారు.







ధ్వజస్తంభం వద్ద పూల అలంకరణ, ఆలయ ప్రవేశమార్గంలో పూలతో జైశ్రీరామ్, మెట్ల వద్ద హనుమద్వజాలతో స్వాగతం

బాతుపిల్లల కోసం వెళ్లి మృత్యుఒడికి

- పొలంలోని నీటిగుంతలో పడి ఇద్దరు బాలురు మృతి
- సత్తుపల్లి మండలం కాకర్లపల్లిలో విషాదం





ఇద్దరు చిన్నారుల మృతికి కారణమైన నీటిగుంతను పరిశీలిస్తున్న గ్రామస్థులు, పోలీసులు

సత్తుపల్లి, జనవరి 21: వ్యవసాయ భూమిలో ఉన్న ఓ పెద్దగుంతలో ఉన్న బాతు పిల్లలతో ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ నీటిలో పడి ఇద్దరు చిన్నారులు మృతిచెందిన ఘటన ఆదివారం ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం కాకర్లపల్లి గ్రామంలో జరిగింది. కాకర్లపల్లికి చెందిన కోలా మహేష్, నాగమణి దంపతులు కుమారుడు సిద్ధార్థ్ (12), ఈశ్రం శ్రీనివాసరావు, గంగాభవాని దంపతు ల కుమారుడు వికాస్(6)లు మరికొందరు పిల్లలతో కలిసి సమీపంలోని వ్యవసాయ భూమిలో ఆడుకునేందుకు వెళ్లారు. ఈ క్రమంలో అక్కడ ఉన్న పెద్దగోతిలో బాతు పిల్లలు కనిపించడంతో వాటితో ఆడుకునేందుకు సిద్ధార్థ్, వికాష్‌లు గోతిలోకి దిగారు. ఈ క్రమంలో వికాష్, సిద్ధార్థ్‌లు ప్రమాదవశాత్తు నీటిలో మునిగారు. దాంతో తోటి పిల్లలు వెంటనే గ్రామంలోకి వెళ్లి విషయం చెప్పడంతో గ్రామస్తులు అక్కడకు చేరుకుని వారిని బయటకు తీసి సత్తుపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే సిద్ధార్థ్, వికాష్‌లు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సత్తుపల్లి పట్టణ సీఐ జే.మోహన బాబు మృతదేహాలను సందర్శించి విచారణ చేపట్టారు. సిద్ధార్థ్ 6వ తరగతి చదువుతుండగా, వికాష్ 2వ తరగతి చదువుతున్నాడు. చిన్నారుల మృతదేహాలను సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి సందర్శించి నివాళులర్పించారు.

ఎన్నెస్పీ ఆయకట్టులో సాగు సంకటం



సాగుకు నోచుకోని ఆయకట్టు భూములు

- కృష్ణ బేసిన్‌లో వర్షాభావ పరిస్థితే ప్రధాన కారణం
- గత 20ఏళ్లలో పది సీజన్లు కోల్పోయిన రైతులు
- సీతారామ ప్రాజెక్టుపైనే ఆశలు

కల్లూరు, జనవరి 19: నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎగువన కృష్ణబేసిన్‌లో తరుచుగా ఏర్పడుతున్న వర్షాభావ పరిస్థితుల వల్ల సాగర్ ఎడమ కాల్వ పరిధిలోని ఆయకట్టు భూములు గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. కర్నాటకలోని కృష్ణ బేసిన్ పరివాహక ప్రాంతంలో సరియైన వర్షాలు కురిసి వరద పుష్కలంగా ఉంటేనే సాగర్ నిండుతుంది. అప్పడే కాల్వల ద్వారా సాగునీరు అంది పంటలు పండే ఆవకాశం ఉంది. ఈ ఏడాది వానకాల సీజన్‌లో సరైన వర్షాలు లేకపోవడంతో సాగర్ డ్యాం నిండలేదు. దీంతో ఈ ఏడాది సాగర్‌నీరు లేక జిల్లాలోని ఆయకట్టు రైతులు వానకాలం, ఎండకాలం పంటలను కోల్పోయారు. ఖమ్మం జిల్లాలో ఎన్నెస్పీ ఆయకట్టు కింది 2.54,270 లక్షల ఎకరాలు బీళ్లుగా మారాయి. చెరువులు, బోర్లు, వాగులు, లిఫ్టుల ఆధారంగా కొంత మేరకే రైతులు వరి, మిర్చి, పత్తి, మొక్క జొన్న సాగు చేశారు. సాగర్ ఎడమ కాల్వ పరిధిలో వర్షకాల సీజన్ అనుకూలించక పోతే కనీసం ఒక పంట కూడా పండదని ఈ ప్రాంత రైతుల్లో విశ్వాసం సన్నగిల్లుతోంది. ఇలా అనేక సంత్సారాల నుంచి సాగర్ ఆయకట్టు పరిధిలో రైతులు పలు సీజన్లలో ఏర్పడిన వర్షభావ పరిస్థితి కారణంగా పంటలను కోల్పోతున్నారు.

2001 నుంచి పది సీజన్లలో సాగుకు గడ్డుకాలం

జలవనరుల శాల నుంచి అందిన సమాచారం ప్రకారం కర్ణాటక ఎగువన కృష్ణబేసిన్‌లో వర్షాలు లేకపోవడంతో 2001నుంచి 2023-2024 సంవంత్సరం వరకు సాగర్ కాల్వ ద్వారా నీరురాక పది సంత్సరాల వ్యవసాయ సీజన్లలో రైతులు పంటలు సాగు చేయలేకపోయారు. ఈ ఏడాది వానకాలం, ఎండకాలం పంటలను రైతులు కోల్పోయారు.

సీతారామ ప్రాజెక్టే శరణ్యం

గోదావరి జలాలను పాలేరు జలాశయానికి అనుసంధానం చేసి సాగునీరు పారేలా ప్రభుత్వం తలపెట్టిన సీతారామ ప్రాజెక్టును సత్వరమే పూర్తిచేసి సాగు నీరు అందిస్తే సాగర్ రైతులు వర్షాభావ పరిస్థితిని అధికమించి తద్వారా ఏటా రెండు పంటలు పండించే ఆవకాశం ఉంది. అనుకోని పరిస్థితుల్లో సాగర్ ఎగువన కృష్ణబేసిన్ నుంచి వరదనీరు ప్రాజెక్టు డ్యాంలో చేరకపోయినా, ప్రత్యామ్నాయంగా గోదావరి జలాలు సీతారామ ప్రాజెక్టు ద్వారా పాలేరు జలాశయంలో అందించినప్పడే సాగర్ ఆయుకట్టు రైతుల కష్టాలు తీరుతాయి. అందువల్ల నిర్మాణంలో ఉన్న సీతారామ ప్రాజెక్టు పనులు సత్వరమే పూర్తి చేసి పాలేరు జలాశయం నుంచి సాగునీరు అందిస్తే జిల్లాలో లక్షలాది ఎకరాల భూమి సస్యశ్యామలమయ్యే ఆవకాశం ఉంది. కరువు పరిస్థితి నెలకొన్న ఇలాంటి పరిస్థితుల్లో సీతారామ ప్రాజెక్టే శరణ్యమని రైతులు అభిప్రాయపడుతున్నారు.



నీరు లేక బోసిపోయిన సాగర్ ఎడమకాల్వ

ప్రతిఇంటా ఇప్పమొక్క

- పరిరక్షణతో పాటు ఆర్థిక బలోపేతమే లక్ష్యం
- ఏజెన్సీలో తగ్గుతున్న సేకరణ
- మొక్కల పెంపకానికి చొరవతీసుకున్న ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్

భద్రాచలం, జనవరి 21: ఇటీవల ఏజెన్సీలో ఇప్పపువ్వు సేకరణ గణనీయంగా తగ్గిపోతోంది. అడవుల నరికివేత పోడు వ్యవసాయం, ఇతరత్రా కారణాలతో గతంలో ఎక్కడ చూసినా కనిపించే ఇప్పచెట్లు ప్రస్తుతం కనిపించని పరిస్థితి నెలకొంది. ఫలితంగా జీసీసీ సేకరణలో సైతం లక్ష్యాన్ని చేరుకోవడం లేదు. ఈక్రమంలో ఇప్ప మొక్కలను పరిరక్షించడంతోపాటు గిరిజనులను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా భద్రాచలం ఐటీడీఏ కసరత్తును చేపట్టింది. ఇందులో భాగంగా భద్రాచలం ఏజెన్సీలోని గిరిజనులకు ఇప్పమొక్కలను అందించాలని ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఐటీడీఏకు వివిధ పనుల నిమిత్తం వచ్చే గిరిజనులకు ఆ మొక్కలను అందించే కార్యక్రమానికి ఈ నెల 9న శ్రీకారం చుట్టారు. ఇందుకోసం అటవీశాఖ సహకారం తీసుకుని 5 వేల మొక్కలను ఈ సీజన్‌లో గిరిజనులకు అందించాలనే లక్ష్యంతో ఐటీడీఏ అడుగులు వేస్తోంది. ఒక్కొక్క కుటుంబానికి వారు కోరినవన్నీ మొక్కలు అందించేందుకు ఐటీడీఏ చర్యలు తీసుకుంది.

రక్త హీనతన నుంచి రక్షించే ఔషధం

ఏజెన్సీలో ప్రాంతంలో రక్తహీనతతో బాధపడే వారు గిరిజనుల్లో అధిక శాతం ఉంటారు. ఈ క్రమంలో రక్తహీనత నుంచి రక్షించేందుకు ఇప్పపువ్వు ప్రత్యేక ఔషధంగా పేర్కొననచ్చు. దీనితో లడ్డూలను తయారు చేసి ఆదిలాబాద్ ఏజెన్సీలో ప్రాంతంలో గిరిజనులకు అందిస్తున్నారు. ఇప్పనూనే, ఇప్పసారాను గిరిజనులు తయారు చేస్తుంటారు. కాగా భద్రాద్రి రాముడికి ప్రత్యేక ప్రసాదంగా గత కొన్ని దశాబ్దంగా ఇప్పపువ్వును ఆలయ పరిసరాల్లో అమ్ముతున్నారు. దీంతో అధికారులు ఇప్పపువ్వువల్ల కలిగే లాభాలను గిరిజనులకు అవగాహన కల్పించేందుకు చర్యలు చేపడుతున్నారు. దీనిద్వారా గిరిజనులు ఆర్థిక స్వాలంబన దిశగా అడుగులు వేయాలని ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ ఆకాంక్షిస్తున్నారు. ఆయన ప్రత్యేక చొరవతో ఇంటింటా ఇప్పమొక్క కార్యక్రమానికి అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టింది.



ఇప్ప మొక్కలను పంపిణీ చేస్తున్న పీవో(ఫైల్)

భూ ఆక్రమణలపై ఇంటెలిజెన్స్ నజర్

ఖమ్మంలో సర్వే నెం. 344లోని భూముల వివరాల సేకరణ



'ఆంధ్రజ్యోతి' కథనాలు

ఖమ్మం, జనవరి21(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు రోజుకొకటి వెలుగులోకి వస్తున్నాయి. అక్రమార్కులు ఎప్పటికప్పుడు కొత్త ఎత్తులు వేస్తూ కనిపించినకాడికి రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వభూమిని తమ వశం చేసుకున్నారు. ఇటీవల 58, 59 జీవోల పేరుతో పదుల సంఖ్యలో స్థలాలు అక్రమ క్రమబద్ధీకరణ చేసుకున్న విషయం వెలుగులోకి రాగా.. తాజాగా నగరంలోని 344సర్వే నెంబరు లో ఉన్న సుమారు రెండెకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారనీ, దానికి సంబంధించిన రికార్డులు సైతం కార్యాలయాల్లో మాయం చేశారంటూ 'స్వాధీనం చేసుకున్నా స్వాహా' అంటూ 'ఆంధ్రజ్యోతి' గురువారం కథనం ప్రచురించింది. దానితో పాటుగా సదరు సర్వే నెంబరులోని ప్రభుత్వ భూమిని గత అధికార పార్టీ నేతలు కొందరు ఏ తరహాలో తమ చేతుల్లోకి తీసు కున్నారో వివరిస్తూ 'అనుమతులు మాటున అక్రమాలు' శీర్షికన మరో కథనం ప్రచురించింది. ఆయా కథనాల్లో గతంలో ఆ సర్వే నెంబరులో పేదలను ఖాళీ చేయించిన విషయాలను, అప్పట్లో వారు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా దానిపై విచారణ చేయించిన విషయాలను పేర్కొంది. కాగా దానిపై ఇంటెలిజెన్స్ అధికారులు వివరాలను సేకరించి నివేదిక సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. 2013లోనూ దానిపై విచారణ నిర్వహించిన సమాచారం సదరు శాఖ దగ్గర ఉన్నట్టు తెలిసింది. కాగా తాజాగా మరోసారి ఆక్రమణలు జరుగుతున్న తీరును వివరిస్తూ వారు నివేదిక సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. అందులో భాగంగా ఆ సర్వే నెంబరులో గతంలో ఖాళీ చేయించిన పేదలనుంచి వివరాలు పొందినట్టు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఈ వ్యవహారంపై ఆలస్యం లేకుండా ఉన్నతాధి కారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వెల్లివిరిసిన మత సామరస్యం

» అయోధ్య రాముడి అక్షింతలు పంపిణీ చేసిన రామచంద్రాపురం ముస్లింలు



అయోధ్య అక్షింతలను తలపై మోస్తూ రామాలయనికి చేరవేస్తున్న రామచంద్రాపురం మాజీ సర్పంచ్ కరీముల్లా

పెనుబల్లి, జనవరి 22: ఆ గ్రామంలో హిందు సంప్రదాయాలను కూడా ముస్లింలు పాటిస్తూ రామా లయాన్ని నిర్మించటమే కాకుండా అయోధ్య నుంచి వచ్చిన అక్షింతులు, రాముడి చిత్రపటాలను ఇంటింటికి పంపిణీ చేసి మతసామరస్యాన్ని చాటి ఆదర్శంగా నిలిచారు. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం రామచంద్రాపురం గ్రామంలో ముస్లింలు పండుగుల సందర్భంగా హిందు దేవాలయలను దర్శించుకుం టారు. గ్రామంలో రామాలయ నిర్మాణా నికి కమిటీ సభ్యులతో పాటుగా గ్రామ మాజీ సర్పంచ్ ఎస్‌కే. కరీముల్లా తమ వంతుగా ఆలయ నిర్మాణంలో పాలు పంచుకున్నారు. ఈ క్రమంలోనే ఆదివారం అయోధ్య నుంచి గ్రామానికి వచ్చిన అక్షింతలను హిందు, ముస్లింలు కలిసి ఊరేగింపుగా దేవాలయానికి చేరవేశారు. తరువాత గ్రామంలో ఇంటింటికీ తిరిగి అక్షితలను పంపిణీ చేశారు. అయోధ్యలో బాలరాముని ప్రాణ ప్రతిష్ట సందర్భంగా గ్రామంలోని రామాలయాన్ని శుభ్రపరిచి సుందరంగా తీర్చిదిద్దారు. గృహాలపై హిందు, ముస్లింలు సమైక్యతగా శ్రీరాముడి పతాకాలను ఎగురవేశారు. కార్యక్రమంలో రామాలయ కమిటీ చైర్మన్ తాటి రాములు, గురువులు కేశవరెడ్డి, మహేష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కరీమూల్లా, అజీముల్లా, ఎస్‌కే రఫీ, పాల్గొన్నారు.



రామచంద్రపురంలో అయోధ్య రాముడి అక్షింతలు పంచుతున్న హిందు, ముస్లింలు

బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠకు ఆహ్వానం

» అయోధ్యకు తరలి వెళ్లిన గిరిజన దంపతులు

జూలూరుపాడు, జనవరి 21: అయోధ్యలోని శ్రీరామ మందిరంలో సోమవారం బాలరాముడి ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని చూసేందుకు మండలంలోని కొమ్ముగూడెం గ్రామానికి చెందిన గిరిజన దంపతులు భూక్యా దేవిప్రసాద్, రీతా సోనీలు అయోధ్యకు తరలి వెళ్లారు. కార్యక్రమానికి రావాలని ఆ గిరిజన దంపతులకు రామ జన్మభూమి ట్రస్ట్ నుంచి ఆహ్వానం అందింది. దీంతో భార్య, భర్తలిద్దరు అయోధ్యకు వెళ్లారు. కాగా కొమ్ముగూ డెం గ్రామానికి చెందిన దేవిప్రసాద్ ఢిల్లిలో నీతి ఆయోగ్ డైరెక్టర్‌గా, భార్య రీతాసోనీ జవహర్‌లాల్ నెహ్రూ యూని వర్సిటీలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. బాలరాముడి ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆహ్వానం అందడంతో ఆదివారం ఆ దంపతులు అయోధ్యకు చేరుకొని ఆనందం వ్యక్తం చేశారు.



అయోధ్యలో ఆహ్వాన పత్రికను చూపిస్తున్న గిరిజన దంపతులు

ప్రతీ ఇల్లు వైద్యశాలగా మారాలి

» అమ్మ వైద్యురాలు కావాలి
» ప్రకృతి ఆరోగ్య విశ్వ విద్యాలయం ఏర్పాటుకు కృషి
» ఆరోగ్యకరమైన సమాజం ఏర్పాటుకు సహకరించాలి
» సిద్ధార్థ యోగా వ్యవస్థాపకుడు కేవై రామచందర్



జాతీయ ఆరోగ్య సమ్మేళనంలో మాట్లాడుతున్న సిద్ధార్థ యోగా వ్యవస్థాపకుడు డాక్టర్ రామచంద్ర, మండలి బుద్ధప్రసాద్, విజయరాం

నేలకొండపల్లి, జనవరి 21: ప్రతీ ఇల్లూ వైద్యశాల కావాలని, వంటిల్లే ఔషధాలయమని, అమ్మే వైద్యురాలని సిద్ధార్థ యోగా విద్యాలయం వ్యవస్థాపకుడు, ప్రకృతి వైద్యుడు డాక్టర్ కేవై రామ చందర్ అన్నారు. నేలకొండపల్లి మండలం, నేలకొండపల్లిలోని సిద్ధార్థ యోగా విద్యాలయంలో ఆదివారం నిర్వహించిన భారత జాతీయ ఆరోగ్య సమ్మేళనంలో ప్రకృతి వైద్యుడు రామచందర్ మాట్లాడుతూ 1999లో ఇద్దరితో స్థాపించిన సిద్ధార్థ యోగా విద్యా లయం ప్రకృతి ప్రేమికుల అండతో అంచెలంచెలుగా ఎదిగింద న్నారు. సహజ జీవనం అనుసరించే వాళ్ళకు మనం మార్గదర్శ కులమవ్వాలన్నారు. వెయ్యికి 999 జబ్బులు తగ్గించేది సహజ జీవ నమేనని, ఆఒక్క జబ్బుకే మందు కనుక్కోవాలన్నారు. జబ్బు చేస్తే మందు వేసుకోవాలని, అసలు జబ్బు రాకుండానే చూసుకుంటే మందులు అవసరం లేదని, జబ్బులు రాకుండా చేసేది ప్రకృతే నని, అందుకే ప్రకృతి జీవనాన్ని అనుసరించాలన్నారు. ప్రకృతి వైద్యం చాలా గొప్పదని, క్యాన్సర్ జబ్బు మూడో దశలో ఉన్నా తగ్గించిందని, షుగర్, థైరాయిడ్, బీపీ లాంటి జబ్బులూ రాకుండా తగ్గుతాయన్నారు. అందుకు సిద్ధార్థ యోగా విద్యాలయమే నిదర్శ నమయ్యారు. అనంతరం హాజరైన ప్రకృతి ప్రేమికులతో ప్రతిజ్ఞ చేయించారు.

నేలకొండపల్లి ప్రకృతి పల్లెగా మారింది: మండలి బుద్ధప్రసాద్

నేలకొండపల్లి చారిత్రకంగా ఎంతో ప్రసిద్ధి చెందిందని, సిద్ధార్థ యోగా విద్యాలయం ఏర్పాటుతో ఇప్పుడు ప్రకృతి పల్లెగా మారిం దన్నారు. ప్రకృతి వైద్యాన్ని ఒక విప్లవంగా ప్రజల్లోకి తీసుకెళ్ళిన ప్ర కృతి వైద్యుడు రామచందర్ దంతులను అభినందిస్తున్నానన్నారు. నేడు ప్రకృతిని కాలుష్యం చేస్తున్నామని, మానసిక శాంతిని, ప్ర శాంతతను కోల్పోతున్నామన్నారు. ప్రతి మొక్క ఔషధ మొక్కేనని, ప్రకృతిని ప్రేమించటం ద్వారా, జీవనాన్ని పెపొందించుకుందా మని బుద్ధప్రసాద్ అన్నారు.



సమ్మేళనానికి హాజరైన ప్రకృతి ప్రేమికులు

ప్రకృతిపై అపారమైన నమ్మకం: సీబీఆర్ ప్రసాద్

భారతీయ విధానాలపై అపారమైన నమ్మకం ఉందని, ప్రకృతి జీవనం ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపుతుందని పౌల్ట్రీల అధినేత సీబీఆర్ ప్రసాద్ అన్నారు. ప్రకృతి జీవన విధాన నిఘంటువు ముద్రణకు రూ.10 లక్షలు ప్రకటించారు.

ప్రకృతి వైద్యం, ప్రకృతి వ్యవసాయం కలిసి పని చేయాలి ప్రకృతి వ్యవసాయ నిపుణుడు విజయరాం

ప్రకృతి వైద్యం...ప్రకృతి వైద్యం రెండూ కలిసి పని చేసినప్పుడే జీవన విధానం మెరుగు పడుతుందని ప్రకృతి వ్యవసాయ ప్రేమికుడు విజయరాం అన్నారు.తాను పండించే సహజ ఉత్పత్తులే గత రెండున్నర సంవత్సరాలుగా తిరుమల శ్రీవేంకటేశ్వరుని గర్భ గుడిలో నైవేద్యంగా వెళుతున్నాయని, ఇది తనకెంతే గర్వకార ణంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆటల జమునారాజేందర్, సెన్సార్ బోర్డు మాజీ సభ్యుడు సంజయ్ కిషోర్, గణిత శాస్త్ర నిపుణుడు బసవేశ్వరరావు, మనసు కవి అందెశ్రీ, గాయకుడు నాగన్న ప్రసంగించారు.

మెడికల్ బోర్డులో దళారులను నిర్మూలిస్తాం

సింగరేణి అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తాం
రూ. 5వేల కోట్ల లాభాలే లక్ష్యంగా పనిచేస్తాం
కొత్త బొగ్గు గనులు తీసుకొస్తాం సీఎండీ బలరాంనాయక్



మాట్లాడుతున్న బలరాంనాయక్

కాకతీయఖని, జనవరి 21: సింగరేణి కార్మికుల వారసులకు ఇచ్చే ఉద్యోగ కల్పనలో ఎలాంటి అవినీతికి తావివ్వకుండా మెడికల్ బోర్డులో దళారుల వ్యవస్థను నిర్మూలిస్తామని సింగరేణి సీఎండీ ఎన్.బలరాంనాయక్ అన్నారు. భూపాలపల్లి పట్టణంలోని అంబేద్కర్ క్రీడా మైదానంలో నాలుగు రోజులపాటు నిర్వహించిన కోలిండియా స్థాయి హాకీ పోటీలు ఆదివారం ముగిశాయి. సింగరేణి భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు అధ్యక్షతన రాత్రి జరిగిన బహుమతుల ప్రదానోత్సవానికి ముఖ్యఅతిథిగా సీఎండీ హాజరయ్యారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో కలిసి విజేతలకు బహుతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తిలో ముందుంటూనే క్రీడారంగంలో రాణిస్తున్న సింగరేణి కార్మికులు అభినందనీయులని కొనియాడారు. మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుకొని సంస్థకు మంచి పేరుగడించాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. సింగరేణిలో కొత్త గనుల ఏర్పాటే ప్రధాన లక్ష్యమన్నారు. బొగ్గు డిమాండ్‌కు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకుంటూ ముందుకు సాగుతామన్నారు. రూ. 5వేల కోట్ల లాభాలు సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. ఏరియాలో సింగరేణి బొగ్గు బావుల విస్తరణకు కావాల్సిన భూసేకరణ విషయంలో స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సహకారం ఉండాలని కోరారు. ఎమ్మెల్యే సత్యనారాయణరావు మాట్లాడుతూ కోలిండియా క్రీడలు భూపాలపల్లి ఏరియాలో నిర్వహించడం శుభపరిణామన్నారు. ఇక్కడ జరిగిన హాకీ పోటీల్లో సింగరేణి జట్టు గెలవడం సంతోషకరమన్నారు. సింగరేణి క్రీడాకారులకు కావాల్సిన సౌకర్యాలను యాజమాన్యం సమకూర్చాలని అన్నారు. వీరిని ప్రోత్సహిస్తే మరింత మెరుగ్గా ఆడి జాతీయ స్థాయిలో రాణిస్తారన్నారు. సింగరేణి ఆస్పత్రితో అన్ని రకాల సౌకర్యాలు కల్పించి వైద్యులను నియమించాలని సీఎండీని ఎమ్మెల్యే కోరారు. ఏరియాలోని నిరుద్యోగులకోసం స్కిల్ డెవలప్‌మెంట్ క్లాస్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఓసీల్లో బ్లాస్టింగులతో శాంతినగర్ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలను సింగరేణి యాజమాన్యం పరిష్కరించాలని కోరారు. డీఎంఎఫ్‌టీ నిధులు ఏరియా అభివృద్ధికి ఖర్చు చేసేలా కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (పా) ఎన్.వి.కె.శ్రీనివాస్, ఏజీఎం(ఈఅండ్ఎం) రాజశేఖర్, అధికారులు తుకారం, గుండు రాజుయాదవ్, శ్యాంప్రసాద్, పర్శ శ్రీనివాస్, ఏఐటీయూసీ నాయకుడు సీతారామయ్య, ఐఎన్‌టీయూసీ నాయకుడు జనక్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కోలిండియా హాకీ పోటీలు: విజేతగా సింగరేణి జట్టు

భూపాలపల్లిలోని అంబేద్కర్ క్రీడామైదానంలో నాలుగు రోజులుగా జరిగిన కోలిండియా స్థాయి హాకీ పోటీలు ముగిశాయి. ఆదివారం హోరాహోరీగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఎన్‌సీఎల్ మధ్యప్రదేశ్ జట్టు, ఎస్‌సీసీఎల్ (సింగరేణి) తెలంగాణ జట్టు తలపడ్డాయి. సింగరేణి జట్టు విజేతగా నిలిచింది.

కూరగాయల మార్కెట్లో గుండెపోటుతో రైతు మృతి

» మహబూబాబాద్ జిల్లా మరిపెడలో టమాటాలు విక్రయించేందుకు వెళ్లగా ఘటన
» ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే కన్నుమూత
» మృతుడు తిరుమలాయపాలెం మండల వాసి



మృతి చెందిన రామస్వామి

మరిపెడ, జనవరి 21 : గుండెపోటుతో ఓ రైతు మృతి చెందిన సంఘటన ఆదివారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ కూరగాయల మార్కెట్లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామానికి చెందిన రమణబోయిన రామస్వామి (56) తన తోట నుంచి టమాటలను ఆటోలో మరిపెడ సంతకు తీసుకొచ్చాడు. వాటిని ఆటో నుంచి దించేక్రమంలో ఆయన గుండెపోటుకు గురై అక్కడికి అక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. వారంవారం జరిగే మరిపెడ సంతకు ప్రతీ ఆదివారం రమణయ్య పిండిప్రోలు ఊరు నుంచి కూరగాయలను ఆటోలో తీసుకొచ్చి అమ్ముకుంటాడు. ఈ ఆదివారం సైతం కూరగాయలను తెచ్చి, అందరు చూస్తుండగానే రమణయ్య మృత్యు ఒడికి చేరిందని సహచర చిరు వ్యాపారులు తమ కళ్ల ముందే జరిగిన రమణయ్య మృతితో కన్నీటి పర్యంతం చెందారు. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలుపడంతో మృతదేహాన్ని సొంతూరుకు తరలించారు. రమణబోయిన రామస్వామి మృతితో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి.

డీసీఎంఎస్ చైర్మన్‌పై చర్యలు తీసుకోవాలి

సొసైటీ డైరెక్టర్ డిమాండ్.. జిల్లా అధికారికి ఫిర్యాదు



విలేకరుల సమవేశంలో మాట్లాడుతున్న పాసంగులపాటి లక్ష్మీనారాయణ

ఖమ్మంచర్చికాంపౌండ్, జనవరి21: 'ఖమ్మం డీసీఎంఎస్ చైర్మన్ తల్లాడ మండలం గంగదేవిపాడు సహకార సంఘం అధ్యక్షుడు రాయల శేష గిరిరావు తప్పుడు పత్రాలు సృష్టించి రుణాలు తీసుకున్నారు. సొసైటీలో నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని' సొసైటీ డైరెక్టర్ పాసంగులపాటి లక్ష్మీనారాయణ ఆరోపించారు ఈమేరకు జిల్లా సహకార అధికారికి ఫిర్యాదు చేశారు. ఆదివారం నగరంలోని ప్రెస్ క్లబ్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఫిర్యాదు పత్రాలను విలేకరులకు అందించారు. గంగదేవిపాడు సొసైటీ అధ్యక్షుడిగా ఉన్న రాయల వెంకటశేషగిరిరావు నకిలీ పత్రాలు సృష్టించి పెద్దఎత్తున నిధులు కాజేశారని, ఇష్టానుసారంగా సిబ్బందిని నియమించారని, తద్వారా సంఘం నష్టపోతుందని దీనిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. గతంలో ఫిర్యాదు చేసినప్పటికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని సొసైటీలో సీఈవో తండ్రి సాంబశివరాజు అనధికారికంగా విధులు నిర్వహిస్తు, అవినీతి, అక్రమాలకు సహకరిస్తున్నారని పేర్కొన్నారు. రాయల శేషగిరిరావు కుటుంబసభ్యుల పేర్లతో తప్పుడు పహణీలు సృష్టించి పెద్ద ఎత్తున రుణాలు తీసుకున్నారని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నుంచి కూడా కారు రుణం రూ.27లక్షల రుణాలు పొందారని, ఆయన పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులు పేర్లపై తప్పుడు పహణీలు పెట్టి అధికమొత్తంలో రుణాలు పొందారని వీటన్నింటిపై విచారణ జరపాలని తన అధికారంతో సహకార శాఖను మోసపూరితంగా వాడుకుంటున్నారని అతనిపై పూర్తిసాయి చర్యలు తీసుకోవాలని ఆయన ఆరోపించారు. కాగా పై ఆరోపణలపై డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావును వివరణ కోరగా తనపై చేసిన ఆరోపణలన్ని అవాస్తవమని, ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని తెలిపారు. కారు బకాయిలు కూడా చెల్లించామని ఆయన ఈసందర్భంగా ప్రకటించారు



పోటీలను ప్రారంభిస్తున్న అంజనబాబు

రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు ప్రారంభం

మధిరటౌన్,జనవరి21: మధిర లోని ఇండోర్ స్టేడియం లో ఆదివారం రాష్ట్రస్థాయి కరాటే పోటీలు ప్రారంభయ్యాయి. శ్రీనిధి స్కూల్, వీరన్న కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీలను కరస్పాండెంట్ అంజనబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటే ఆత్మరక్షణ కోసం ఎంతో అవసరమని ముఖ్యంగా మహిళలు దీన్ని నేర్చుకోవాలని, స్కూల్ స్థాయి నుంచే విద్యార్థులకు నేర్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.

చైన్‌స్నాచర్ అరెస్ట్ రూ.3.20లక్షల సొత్తు స్వాధీనం

సత్తుపల్లిరూరల్, జనవరి21: సత్తుపల్లి పట్టణంలో పలు సందర్భాలలో మహిళల మెడలలో బంగారు చైన్లు తెంచుకుని పరారైన దొంగను సత్తుపల్లి పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించి పట్టణ సీఐ జే. మోహనబాబు తెలిపిన వివరాల ప్రకారం వేంసూరు మండలం లచ్చన్నగూడెం స్వగ్రామమైన ఇమ్మడి రాము సత్తుపల్లిలోని వేంసూర్ రోడ్‌లో నివాసం ఉంటున్నాడు. అతను ప్రయివేటుగా ఉద్యోగం చేస్తున్నాడు. గత ఏడాది ఫిబ్రవరిలో కాకర్లపల్లి గ్రామంలో కిరాణా షాప్ నడుపుతున్న గార్లపాటి పుష్పావతి అనే మహిళ వద్దకు వెళ్లి టూత్‌పేస్ట్ కావాలని అడిగి ఆమె షాపులోకి వెళ్లగా ఆమె మెడలో ఉన్న నానుత్రాడును తెంచుకుని బైక్‌పై పరారయ్యాడు. అదేఏడాది జూలై మొదటి వారంలో సత్తుపల్లి పట్టణంలోని టీఆర్‌ఆర్ వీధిలో జంగాల కనకరత్నం ఉంటున్న ఇంటిలోకి వెళ్ళి ఇల్లు అద్దెకు కావాలని అడిగి ఇల్లు చూపిస్తున్న సమయంలో ఆమె మెడలో బంగారు గొలుసు తెంచుకుని వెళ్లాడు. అదే ఏడాది అక్టోబర్ నెలలో రమాకాంత్ ఆసుపత్రి వీధిలో బొమ్మిరెడ్డి విజయలక్ష్మీ ఇంటి వద్ద కరెంట్ మోటార్‌లో మంటలు వస్తున్న సమయంలో నిందితుడు అక్కడికి వెళ్ళి మంటలను ఆర్పివేశాడు. విషయం ఆమె ఫోన్‌లో బంధువులకు చెబుతుండగా ఆమె మెడలోని బంగారు చైన్ లాక్కోని పరారయ్యాడు. ఈ సంఘటనలకు సంబంధించి అప్పట్లో కేసులు నమోదయ్యాయి. శనివారం సత్తుపల్లి పట్టణంలోని రింగ్ సెంటర్‌లో వాహనాల తనిఖీ చేస్తుండగా అనుమా నాస్పదంగా ఉన్న ఇమ్మడి రామును అదు పులోకి తీసుకుని విచారించగా చైన్‌స్నాచింగ్ సంఘటనలు విచారణలో తేలడంతో అత న్ని అరెస్ట్ చేసినట్లు మోహనబాబు తెలిపారు. అతని వద్ద నుంచి రూ.50వేల విలువైన మోటారు సైకిల్‌తో పాటు మొత్తం 54గ్రాముల బరువైన రెండు బంగారపు ముద్దలను స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ రూ.3.20లక్షలు ఉంటుందని తెలిపారు.



చోరీ జరిగిన విషయాన్ని చెబుతున్న ఉపాధ్యాయులు

ప్రభుత్వ పాఠశాలలో చోరీ

సుజాతనగర్, జనవరి 21: మండలంలోని రాఘవాపురం ప్రభుత్వ పాఠశాలలో చోరీ జరిగింది. గ్రామంలో ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థుల అభ్యసన అవసరార్థం ప్రభుత్వం కంప్యూటర్లు అందించింది. వాటిని ఒక గదిలో పెట్టి భద్రపరిచారు. సంక్రాంతి సెలవుల నేపథ్యంలో ఆ గది తాళం తీయలేదు. శనివారం గది తాళాలు తీసి చూడగా 5 కంప్యూటర్లు, 3 బ్యాటరీలు కన్పించలేదు. దీంతో చోరీ జరిగిందని గమనించిన ఉపాధ్యాయులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఉపాధ్యాయుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

టాలెంట్ టెస్ట్‌లో

పాల్వంచ విద్యార్థి ప్రతిభ



మాన్విక్ రత్నం

పాల్వంచ, జనవరి 21 : ఈ నెల 20న యూనిఫైడ్ కౌన్సిల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ లెవెల్ సైన్స్ టాలెంట్ పరీక్షల్లో పాల్వంచ మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన విద్యార్థి తన సత్తా చాటాడు. ఆల్ ఇండియా మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఆదివారం సదరు విద్యార్థికి పాఠశాల యాజమాన్యం ద్రవీకరణ పత్రాన్ని అందజేశారు. పాల్వంచ పట్టణ పరిధిలోని నవభారత్ పబ్లిక్ స్కూల్‌లో 1వ తరగతి చదువుకుంటున్న బాదర్ల మాన్విక్ రత్నం నేషనల్ లెవెల్‌లో మొదటి స్థానం సాధించడం పట్ల పాఠశాల యాజమాన్యం, జగన్నాథపురం గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చెట్టుపై నుంచి పడి కూలీ మృతి

పాల్వంచ, జనవరి 21 : చెట్టుపై నుంచి కిందపడి కూలీ మృతిచెందాడు. పాల్వంచ మండలం కొత్త సూరారం గ్రామానికి చెందిన మూడ్ కిషన్ (40) స్థానికంగా కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో వెంగళరావు కాలనీలో నివాసముంటున్న ఓ వ్యక్తి ఇంట్లో చెట్టు నరకడానికి తన స్నేహితులతో కలిసి ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఉదయం వెళ్లి చెట్టు నరికే కార్యక్రమం ప్రారంభించారు. కిషన్ చెట్టు ఎక్కి నరుకుతుండగా ప్రమాదవశాత్తు చెట్టుకూలిపోవడం, అతను కింద పడటం జరిగిపోయాయి. దీంతో కిషన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతని స్నేహితులు, ఇంటి యజమాని కిషన్‌ను హుటాహుటిన పాల్వంచలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు కొత్తగూడెంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి అనంతరం మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు కిషన్ మృతిచెందాడని నిర్ధారించారు. మృతుడి కుమారుడు మూడ్ మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ రాము తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య

టేకులపల్లి, జనవరి 21: ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని మద్రాసుతండాలో జరిగింది. ఈ ఘటనలో మద్రాసు తండాకు చెందిన జర్పుల సురేష్(25) మృతి చెందాడు. టేకులపల్లి ఎస్సై రమణారెడ్డి కథనం ప్రకారం మద్రాసుతండాకు చెందిన జర్పుల సురేష్ నిత్యం మద్యం తాగుతుండేవాడు. ఈ క్రమంలో ఈ నెల 19న సురేష్ మద్యం తాగి ఇంటికి వచ్చాడు. ఇంటికి వచ్చిన భర్తను తాగుడు మానుకోవాలని ఆయన భార్య సునీత కోరింది. దీంతో అతడు ఆమెతో గొడవపడ్డాడు. ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. వెంటనే కుటుంబసభ్యులు కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు టేకులపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా మృతుడికి భార్యతో పాటు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గార్లపాటి నరసింహారావు

తల్లాడ, జనవరి 21 తల్లాడ సమీపంలోని శ్రీ కృష్ణ కోల్డ్ స్టోరేజ్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు బైక్ లారీ ఢీకొని అక్కడిక్కడే మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం కొ త్తూరుకు చెందిన యువకుడు గార్లపాటి నరసింహారావు (35) బైక్‌పై జూలూరు పాడు నుంచి తల్లాడ వైపుకు వస్తుండగా , సుబాబుల్ లోడుతో తల్లాడ నుంచి భద్రాచలం వెళుతున్న లారీ ఢీకొంది. ప్రమాదంలో నరిసింహారావు మృతి చెందాడు. ఈ మేరకు తల్లాడ ఎస్ఐ పి సురేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అదుపు తప్పి దుకాణాలపై దూసుకెళ్లిన లారీ



లారీ దూసుకెళ్లడంతో ధ్వంసమైన దుకాణాలు

ముదిగొండ, జనవరి 21: అదుపుతప్పి రోడ్డుపక్కనే ఉన్న దుకాణాలపై లారీ దూసుకెళ్లింది. ఈ సంఘటన ఆదివారం ముదిగొండ ప్రధాన సెంటర్లో జరిగింది. కోదాడ నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న లారీడ్రైవర్‌కు ఫిట్స్ రావడంతో అదుపుతప్పి రోడ్డుపక్కనున్న దుకాణాలపైకి లారీ దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాకపోవడంతో అందరూ పీల్చుకున్నారు. లారీ అదుపుతప్పిన సమయంలో అక్కడ జనాలు లేకపోవడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు.

వనప్రాణుల జోలికి వస్తే ఉపేక్షించం

సత్తుపల్లి సంఘటనలో 24గంటలోపు నిందితులు జైలుకు
జిల్లా అటవీశాఖ అధికారి సిద్ధార్థవిక్రమ్‌సింగ్

ఖమ్మం సంక్షేమవిభాగం, జనవరి 21:'అటవీ సంపదతో పాటుగా వన్యప్రాణుల జోలికి వచ్చిన వాటిని వేటాడాలని ప్రయత్నించినా వేటాడిని ఏమాత్రం ఉపేక్షించేది లేదు. అటవీ పరిరక్షణ చట్టాన్ని కఠినంగా అమలు చేస్తామని' జిల్లా అటవీశాఖ అధికారి సిద్దార్థవిక్రమ్‌సింగ్ హెచ్చరించారు. ఆదివారం ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. సత్తుపల్లి అటవీడివిజన్‌లో అక్రమంగా విద్యుత్‌ను వినియోగించి ఓ అడవిదున్న మృతికి కారణమైన నిందితుల్ని సంఘటన జరిగిన 24గంటలలోపుగా పట్టుకొని జైలుకు పంపించామన్నారు. అటవీ ప్రాంతంలో అక్రమంగా విద్యుత్ వినియోగించే వన్యప్రాణాలను వేటాడాలనే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. విద్యుత్‌శాఖ అధికారులకు ఈ మేరకు ఆదేశాలు పంపామని వివరించారు. అటవీహక్కు పత్రాలు పొందిన వారు ఇటువంటి వన్యప్రాణుల వేటలో పాల్గొంటే వారి హక్కు పత్రాలను రద్దు చేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా అటవీప్రాంతంలో గస్తీలను ముమ్మరం చేశామని వన్యప్రాణుల మనుగడను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని సిద్ధార్థ విక్రమ్ సింగ్ పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

రఘునాథపాలెం, జనవరి21: మండల కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మలీదు జగన్ సమక్షంలో చిమ్మపూడికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరారు. ఆదివారం చిమ్మపూడిలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు జోసెబోయిన పాపులు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌కు చెందిన అల్లం వీరయ్య, ఎస్‌కే మదార్, నీలం నాగేశ్వరరావు, నిషాకర్‌రెడ్డి, నీలం వీరబాబు, తూము నాగరాజు, కాంపాటి శ్రీనుతో పాటుగా పలువురు కాంగ్రెస్ కండువాలను కప్పుకున్నారు. కాంగ్రెస్ నాయకులు మారం కరుణాకర్‌రెడ్డి, పుల్లయ్య, వెంకటరెడ్డి, నర్సిరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

ఓటరు జాబితాను నిశితంగా పరిశీలించాలి

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 21: ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో బీఎల్వోలు ఓటరు జాబితాను నిశితంగా పరిశీలించాలని జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. ఆదివారం ఆయన జిల్లా అటవీశాఖ అధికారి కార్యాలయంలోని పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా శనివారం, ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఓటరు జాబితాలో మరణించిన ఓటర్లు, 100కు పైగా వయస్సున్న ఓటర్లు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన ఓటర్లు చిరునామా మారిన ఓటర్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఓటరుజాబితాలో ఉన్న అన్ని పేర్లను పరిశీలించాలన్నారు. ఓటరు జాబితాపై వచ్చిన అభ్యంతరాలపై కూడా దృష్టిసారించాలన్నారు. తొలగింపులపై కూడా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. బీఎల్వోలకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి..ఎన్ని పరిష్కరించారు అని అడిగి తెలుసుకున్నారు. బీఎల్వోలు తమ పరిధిలోని అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటుహక్కును పొందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వారికి సూచించారు. కలెక్టర్ వెంట ఖమ్మం అర్బన్ తహసీల్దారు సిహెచ్ స్వామి, బీఎల్వోలు ఉన్నారు.



బెండ సాగు బహుబాగు

అన్నదాతలకు కాసుల వర్షం కురిపిస్తున్న బెండ సాగు

తక్కువ పెట్టుబడి అధిక దిగుబడి

గిట్టుబాటు ధరతో లాభదాయకం

దెబ్బతిన్న పత్తి, మిర్చికి ప్రత్యామ్నాయంగా బెండ సాగు



బెండకాయలు కోస్తున్న కూలీలు

తల్లాడ, జనవరి 21: కూరగాయ పంటైన బెండ సాగు రైతులకు కాసుల వర్షం కురిపిస్తుంది. తక్కువ పెట్టుబడితో సాగుచేసిన బెండ అధిక దిగుబడి రావడమేకాకుండా మార్కెట్లో గిట్టుబాటు ధర దక్కడంతో రైతులు లాభాలను గడిస్తున్నారు. వానాకాలం సీజన్లో సాగుచేసిన పత్తి, మిర్చి పైర్లు దెబ్బతినడంతో ప్రత్యామ్నాయంగా గత నవంబరు మొదటి వారంలో తల్లాడ మండలంలోని తల్లాడ, అన్నారుగూడెం, నర్సింహారావుపేట గ్రామాల్లో రైతులు బెండ సాగుచేశారు. ఎకరాకు రూ.30వేల మేరకు పెట్టుబడులు పెట్టారు. ప్రస్తుతం బెండకాయ కోత దశలో ఉంది. గత 26రోజులుగా రెండురోజులకోసారి కోతలు కోయడంతో ఎకరాకు నాలుగు క్వింటాళ్ల మేరకు బెండకాయ దిగుబడి వస్తుంది. మార్కెట్లో బెండకాయ ధర క్వింటాకు రూ.నాలుగుదువేలు పలుకుతుంది. ఇప్పటివరకు 26రోజుల వ్యవధిలో ఎకరాకు బెండకాయ 50క్వింటాళ్ల మేరకు దిగుబడి వచ్చింది. మరో 30రోజులపాటు బెండకాయ కోతలు కొనసాగే అవకాశముంది. బెండకాయ పంట కాలం పూర్తిగా ముగిసేవరకు మొత్తం ఎకరాకు వందక్వింటాళ్ల మేరకు దిగుబడి వచ్చే అవకాశముంది. బెండ సాగు వల్ల ఎకరాకు రూ.నాలుగులక్షలకుపైగా ఆదాయం దక్కే అవకాశ ముంది. తక్కువ పెట్టుబడి, 40రోజుల తక్కు వ కాలవ్యవధిలో ఎక్కువ ఆదాయం ఇస్తున్న బెండ సాగు రైతులకు లాభసాటి పంటగా మారింది.

బెండసాగు లాభదాయకంగా ఉంది
సూదా వెంకటేశ్వర్లు, రైతు, నర్సింహారావుపేట



రెండునెలల క్రితం నవంబరు రెండోవారంలో అరెకరం విస్తీర్ణంలో బెండ సాగుచేశాను. అరెకరానికి రూ.15వేల పెట్టుబడి పెట్టాను. 26రోజుల నుంచి రెండురోజులకోసారి చొప్పున బెండకాయ 13కోతలు కోశాం. ఇప్పటికే 26క్వింటాళ్ల బెండకాయ దిగుబడి వచ్చింది. క్వింటా రూ.నాలుగైదువేల చొప్పున అమ్ముతున్నాం. తక్కువ పెట్టుబడి, మార్కెట్లో బెండకాయకు ఎక్కువ ధర ఉండటం వల్ల మంచి ఆదాయం వస్తోంది.

జీవాల పెంపకంతో ఆదాయం

యాసంగి పంట లేకపోవడంతో వినూత్న ఆలోచన

పొట్టేళ్లను సాకుతూ రాబడి పొందుతున్న లచ్చగూడెం రైతు



బీడు భూముల్లో మేస్తున్న పొట్టేళ్లు

చింతకాని జనవరి 21: తీవ్ర వర్షాభావంతో సాగర్ నీరు రాక పంటలు సాగు చేసే అవకాశం లేకపోవడంతో సన్న, చిన్నకారు రైతులు రోజు వారి కూలీ పనులకు వెళ్తున్నారు. మరికొంత మంది ఉన్న కొంత భూమిని సాగు చేస్తూ మరుసటి కాలం కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. కానీ మండల పరిధిలోని లచ్చగూడెం గ్రా మానికి చెందిన రైతు మేకపోతుల నరసింహరావు రోజు వారి పనులకు వెళ్లలేక సొంత ఆదాయం కోసం ప్రత్యామ్నాయం ఆలోచించి పొట్టేళ్ల పెంపకం చేపట్టాడు. నరసింహారావుకు చింతకాని సాగర్ మేజర్ కింద రెండు ఎకరాల సాగు భూమి ఉంది. వానాకాలం పంటగా ఒక ఎకరంలో పత్తి పంట, మరో ఎకరంలో వరి సాగు చేశా డు. గత పది సంవత్సరాల నుంచి యాసంగి పంటగా మొక్కజొన్న సాగు చేస్తు ఆదాయం పొందుతున్నాడు. వర్షాకాలం పంట నూర్పిడి అనంతరం ఈ ఏడాది సాగర్ నీరు లేక పోవడంతో యాసంగిలో పొ లాన్ని ఖాళీగా ఉంచాల్సి వచ్చింది. తోటి రైతులు ఇతర రోజు వారి కూలీ పనులకు వెళ్తుంటే నరసింహరావు సొంత ఆదాయం దిశగా ఆలోచించాడు. తనకున్న రెండు ఎకరాలతో పాటు చుట్టు పక్కన ఉన్న రైతుల పొలాలు బీడుగా ఉండటాన్ని గమనించి వెంటనే పొట్టేళ్ల పెం పకంపై దృష్టి సారించాడు. దీంతో గతేడాది డిసెంబరు చివరిలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ఎన్‌టీఆర్ జిల్లా చిల్లకల్లు సంతకు వెళ్లి 40 పొట్టేళ్లను సుమారు రూ. మూడు లక్షల రూపాయలకు కొనుగోలు చేసి తీసుకొచ్చాడు. పొట్టేళ్ల మేత కోసం సాగర్ ఆయకట్టు కింద బీళ్లుగా ఉన్న పొలాలను ఎంచుకున్నాడు. మరో మూడు నెలల పాటు పొట్టేళ్లను సాకి మే నెలలో వాటిని విక్రయించడం ద్వారా స్వల్ప కాలంలో అధిక ఆదాయం పొందే అవకాశం ఉంది.

మూడు నెలల్లో లక్ష రూపాయలు ఆదాయం వస్తోంది
మేకపోతుల నరసింహరావు, రైతు, లచ్చగూడెం



నీళ్ల లేక యాసంగి పంట సాగు చేయడం లేదు. రోజు వారి కూలీగా వెళ్లడం ఇష్టం లేక సొంత ఆదాయం వస్తుందని పొట్టేళ్ల పెంపకం ఎంచుకున్న. 40 పొట్టేళ్లను 3 లక్షలకు కొనుగోలు చేశా. మూడు నెలల తరువాత విక్రయించడం ద్వారా లక్ష రూపాయల వరకు ఆదాయం వస్తుంది.

చామంతి పూలు.. రోజుకు 12వేలు

» ఎకరం విస్తీర్ణంలో తనికెళ్ల రైతు అద్భుతం » బెంగళూరు నుంచి నారు తెప్పించి చామంతి సాగు

» రోజుకు 50 నుంచి 60 కిలోల పూల విక్రయం » ఉద్యాన శాఖ ప్రోత్సాహం ఉండాలి: రైతు నాగేశ్వరరావు



నాగేశ్వరరావు సాగు చేసిన తోటలో విరగబూసిన చామంతి పూలు

కొణిజర్ల, జనవరి 21: ఆకలి ఎరిగి అన్నం పెట్టాలి అంటారు పెద్దలు. ఇదే నానుడి వ్యవసాయానికి కూడా వర్తిస్తుంది. డిమాండ్ ఎరిగి పంటను సాగు చేస్తే రైతులకు లాభాలే. పైగా తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించాలి. కూలీల అవసరం కూడా తక్కువ ఉండేలా చూసుకోవాలి. సరిగ్గా ఇలాంటి పద్ధతులను పాటిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు కొణిజర్ల మండలం తనికెళ్లకు చెందిన గూడె నాగేశ్వరరావు. చామంతి సాగు చేస్తూ దండి గా ఆదాయాన్ని గడిస్తున్నాడు.

ఎకరం భూమికి కౌలుకు తీసుకుని..

మండలంలోని తనికెళ్ల గ్రామానికి చెందిన గూడె నాగేశ్వరరావు మెయిన్‌రోడ్డు పక్కన ఎకరం భూమిని కౌలుకు తీసుకొని పది గుంటల్లో పసుపు, తెలుపు రకం చామంతి, మిగిలిన భూమిలో బంతిసాగును చేపట్టాడు. బంతిసాగు కూడా ఒకసారి అయిపో యాక రెండోసారి వేశాడు. చామంతిపూతకు మార్కెట్‌లో డిమాండ్ ఉండటంతో స్నేహితుడి ద్వారా బెంగళూరు నుంచి చామంతి నారును తెప్పించుకున్నాడు. అక్టోబరులో సాగు చేశాడు. వందరోజుల్లో పంట చేతికి వచ్చింది. చెట్ల నిండా పూలు విరగబూశాయి. ప్రతి రోజు ఖమ్మంలో రోజుకు 50 నుంచి 60 కేజీల చొప్పున విక్రయిస్తున్నాడు. కిలో పూలు రూ.200కు విక్రయిస్తున్నాడు. పెట్టుబడి సుమారు 40 వేలు అయిందని, ప్రస్తుతం డిమాం డ్ బాగుండటంతో రోజుకు 12,000 దాకా వస్తున్నా యని చెబుతున్నాడు. మంచు వాతావరణం కూడా పూల దిగుబడి పెరిగేందుకు ఓ కారణమని నాగేశ్వరరావు అంటున్నాడు. రోడ్డు పక్కనే ఉన్న పొలం చామంతి పూలు సాగు చేస్తుండటం, ఆ పూలు చూసేందుకు ఆకర్షణీయంగా ఉండటంతో అటుగా వెళ్లేవారు ఫొటోలు దిగుతున్నారు. నాగేశ్వరరావు చామంతి పూలు మాత్రమే కాదు గతంలో కూరగాయలు కూడా సాగు చేశాడు. టమాటా, బెండకాయ, దోసకాయ, ఆకుకూరలు సాగు చేసి లాభాలు గడించాడు. కోతుల బెడద నేపథ్యంలో ప్రస్తుతం చామంతి పూలు సాగు చేస్తున్నాడు. ప్రస్తుతం డిమాండ్ భారీగా ఉన్న నేపథ్యంలో వచ్చే ఏడాది చామంతి విస్తీర్ణాన్ని పెంచుతానని నాగేశ్వరరావు అంటున్నాడు. చామంతితో పాటు బంతి పూల సాగు కూడా చేపడతానంటున్నాడు.

ఉద్యానశాఖ ప్రోత్సాహం ఉండాలి
గూడె నాగేశ్వరరావు, రైతు, తనికెళ్ల



బంతి, చామంతి వేయాలని ఆలోచన రాగానే మిత్రుడు ద్వారా బెంగుళూరు నుంచి నారు తెప్పించుకొన్నాను.. ఇక్కడ అధికారులు రైతులను ప్రోత్సహిస్తే పూలతోటలను సాగు చేయవచ్చు. వ్యవసాయం కంటే ఉద్యాన పంటలే ప్రస్తుతం భాగుంటున్నాయి. అందుకే కూరగాయల సాగు, నర్సరీ, బంతి, చామంతి సాగువైపు దృష్టి పెట్టా. శ్రద్ధ పెడితే చామంతి సాగులో కూడా లాభాలు గడించవచ్చు.

కోర్టు భవనాన్ని త్వరితగతిన నిర్మించాలి

» ఆర్‌అండ్‌బీ అధికారులకు ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జగ్జీవన్‌కుమార్ ఆదేశం



కోర్టు భవనాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

మధిరటౌన్, జనవరి 21: మధిర కోర్టు నూతన భవన నిర్మాణం త్వరితగతిన చేపట్టాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జగ్జీవన్ కుమార్ కోరారు. ఆదివారం మధిరలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రారంబించి నిర్వహించేందుకు భవనాలను పరిశీలించేందుకు ఆయన వచ్చారు. మధిర పాత కోర్టు భవనాన్ని పరిశీలించి అందులోనే కొనసాగుతున్న రికార్డు రూమ్‌ను వెంటనే తరలించి నూతన భవన నిర్మాణాన్ని చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. మధిరకు నూతనంగా మంజూరైన సబ్ కోర్టును తాత్కాలికంగా ఏర్పాటు చేసేందుకు సమీకృత మార్కెట్, అందులోని భవనాలను పరిశీలించారు. కార్యక్రమంలో మధిర కోర్టు న్యాయమూర్తి కార్తీక్ రెడ్డి, బార్ అసోషియేషన్ అధ్యక్షుడు పుల్లారావు, న్యాయవాదులు కోర్టు సిబ్బంది, ఆర్‌అండ్‌బీ, మునిసిపల్, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణికి క్లిష్టతరమైన శస్త్రచికిత్స

» ప్రాణాపాయం నుంచి రక్షించిన అశ్వారావుపేట ప్రభుత్వ వైద్యులు: తల్లీబిడ్డ క్షేమం



శస్త్రచికిత్స అనంతరం కృష్ణకుమారి, ఆమె బిడ్డ

అశ్వారావుపేట, జనవరి 21: ప్రాణాపాయంలో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన గర్భిణికి అశ్వారావుపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యులు శస్త్రచికిత్స చేసి ప్రసవం చేశారు. ఈమేరకు సూపరింటెండెంట్ డా. విజయ్‌కుమార్ ఆదివారం విలేకరులకు వివరాలు తెలిపారు. మండల పరిధిలోని జమ్మిగూడేనికి చెందిన ముప్పాళ్ల కృష్ణ కుమారి నిండు గర్భిణి. ఆమె రెండో కాన్పుకోసం శనివారం అశ్వారావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. మొదటి కాన్పు సాధారణం అవ్వడంతో వైద్యులు సుఖ ప్రసవం కోసం ప్రయత్నించారు. గైనకాలిజిస్ట్ డా. రాధ రుక్మిణి పరీక్షించగా అప్పటికే బిడ్డ అడ్డం తిరగటం, మెడలో పేగులు వేసుకొని ఉండటం, బిడ్డ ఉమ్మనీరు తాగడం గమనించి వెంటనే ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు, కృష్ణకుమారి బంధువులకు తెలియజేశారు. చాలా క్లిష్టతరమైన శస్త్రచికిత్స చేయించాల్సి ఉంటుందని, అందుకు దారి తీసిన పరిస్థితులను వారికి వివరించారు. తక్షణమే ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. విజయ్‌కుమార్ నేతృత్వంలో మత్తు డాక్టర్ ప్రసాద్‌ను పిలిపించి ఆపరేషన్ చేసి బిడ్డనను బయటకు తీశారు. బిడ్డ 3.3కిలోలు ఉందని, తల్లి బిడ్డ క్షేమంగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు. క్లిష్టమైన శస్త్రచికిత్సను చేసి తల్లీబిడ్డను రక్షించిన వైద్య బృం దాన్ని ఉన్నతాధికారులు అభినందించారు. గైనకాలజిస్ట్ రాధ రుక్మిణి, మత్తు డాక్టర్ ప్రసాద్, డా. కృష్ణకాంత్, సీనియర్ నర్సింగ్ స్టాఫ్ శస్త్రచికిత్సలో పాలుపంచుకున్నారు.

వామ్మో.. కుటుంబ పత్రం

» ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం పాట్లు

» జారీలో విపరీతమైన జాప్యం

» అర్బన్ తహసీల్‌లో సిబ్బంది పని ఒత్తిడే కారణం



అర్బన్ తహసీల్దార్ కార్యాలయం



ఖమ్మం కార్పొరేషన్, జనవరి 21: నగరంలోని శ్రీనివాసనగర్‌లో నివసించే పోలీస్ కానిస్టేబుల్ ఒకరు అనారోగ్యంతో మరణించారు. అతడికి సంబంధించిన బ్యాంక్ లావాదేవీలు, ఇతరత్రా పనులకోసం ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ (కుటుంబ ధ్రువీకరణ పత్రం) అవసరమయింది. భార్య 2022, జూలైలో దరఖాస్తు చేస్తే ఇంతవరకు సర్టిఫికెట్ రాలేదు. సుమారు 18నెలలుగా ఆమె కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉంది. ఒక రైల్వే ఉద్యోగి మరణిస్తే ఫ్యామిలీ మెంబర్ల ధ్రువీకరణ పత్రం కోసం అతడి భార్య దరఖాస్తు చేసి, నెలల తరబడి సర్టిఫికెట్ కోసం కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసింది. వీరిద్దరే కాదు అనేకమంది ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ గురించి నెలల తరబడి ఖమ్మం అర్బన్ తహసీల్‌దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు,

ధ్రువపత్రాల జారీలో తీవ్ర జాప్యం

ఖమ్మం అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో ఫ్యామిలీ మెంబర్ ధృవపత్రాల జారీలో తీవ్ర జాప్యం ఏర్పడుతోంది. దీంతో దరఖాస్తుదారులు కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రతిరోజు తిరగటం, కార్యాలయ ఉద్యోగులు ఏదో ఒకటి చెప్పి పంపటం నిత్యకృత్యమయింది. కుటుంబ సభ్యులకు సంబంధించిన ధ్రువీకరణ పత్రం ఎంతో కీలకం. ఉద్యోగి మరణిస్తే అతడికి సంబంధించి బ్యాంక్‌లో డిపాజిట్లు, ఆస్తులు, అలాగే కుటుంబసభ్యులకు ఉద్యోగం తదితర అంశాలకు ఈ సర్టిఫికెట్ ఎంతో అవసరం. ఇంత ముఖ్యమైన సర్టిఫికెట్ విషయంలో అర్బన్ తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగులు ఎంతో నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. కొందరి ఫైళ్లు కూడా కనబడటం లేదంటే కార్యాలయంలో సంబంధిత ఉద్యోగుల పనితీరుకు అద్దం పడుతున్నది.

ఎందుకీ జాప్యం?

ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసిన తరువాత, ఆర్‌ఐలు సదరు ప్రాంతానికి వెళ్లి విచారణ నిర్వహించాలి. గతంలో వీఆర్‌వోలు విచారణ నిర్వహించేవారు. వీఆర్‌వో వ్యవస్థను రద్దు చేయటంతో ప్రస్తుతం కార్యాలయంలో ఉన్న ఇద్దరు ఆర్‌ఐలు విచారణకు వెళ్లాల్సి వస్తోంది. అయితే ఆర్‌ఐలకు వివిధ బాధ్యతలు అప్పగించటంతో వారు ఫ్యామిలీ మెంబర్ ధ్రువీకరణ పత్రానికి సంబంధించి విచారణ చేయలేకపోతున్నారు. దీంతో వాటి జారీలో తీవ్రజాప్యం ఏర్పడుతోంది. దానికితోడు ఆదాయం, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు వందల సంఖ్యలో వస్తుంటాయి. వాటిని పరిశీలించాలి. అలాగే భూసర్వేలు, రెవెన్యూకు సంబంధించిన ఇతర పనులతో తీరిక లేకుండా ఉన్న ఆర్‌ఐలు, వారసత్వ ధ్రువపత్రాల విచారణకు వెళ్లలేక పోతున్నారు. దీంతో ప్రైవేటుగా సిబ్బందిని నియమించి విచారణ చేయిస్తున్నారు. దీనిలో చిన్న పొరపాటు జరిగినా, తహసీల్దార్ తిరస్కరించి, మళ్లీ విచారణకు ఆదేశిస్తున్నారు. ఇదిలా ఉండగా, తహసీల్దార్‌కు పని ఒత్తిడి ఉండటంతో వచ్చిన ఫైలు పరిశీలనను పెండింగ్‌లో ఉంచుతున్నారు. అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందిని పెంచితేనే ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందే అవకాశం ఉంది.

గురుకుల పరీక్ష దరఖాస్తు గడువు పొడగింపు

పాల్వంచ రూరల్, జనవరి 21: తెలంగాణ సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, వెనుకబడిన తరగతుల సంక్షేమ, జనరల్ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి టీజీసెట్ 2024 ఇంగ్లీష్ మీడియం ప్రవేశాలకు 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ నెల 23వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని టీఎస్‌డబ్ల్యూఆర్ కిన్నెరసాని ప్రిన్సిపాల్ ఆర్ గోవర్ధన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11న ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకూ ఉంటుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్లైన్ ద్వారా రూ. 100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని గురుకుల పాఠశాలల్లో మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తామని తెలిపారు.

ట్రాన్స్‌జెండర్‌ను వివాహమాడిన యువకుడు



నందు, నక్షత్ర

ఏన్కూరు, జనవరి21: లింగబేధాలు లేకుండా ట్రాన్స్‌జెండర్‌ను వివాహమాడి ఆదర్శంగా నిలిచాడు ఓయువకుడు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం వేమిరెడ్డిపల్లి తండాకు చెందిన అజ్మీర నందు అనే యువకుడు ఏన్కూరుకు చెందిన ట్రాన్స్‌జెండర్ నక్షతను వివాహం చేసుకుని ఆదర్శంగా నిలిచాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం కాస్త ప్రేమగా మారింది. మూడేళ్లనుంచి ఒకరికొకరు ప్రేమించుకుంటున్నారు. ఇంట్లో వరుడు తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడంతో ఆదివారం గార్లొడ్డు శ్రీలక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో వివాహం చేసుకున్నారు. ట్రాన్స్‌జెండర్‌ను వివాహం చేసుకోవడంతో వివాహ వేడుకను మండల ప్రజలు ఆసక్తిగా తిలకించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ట్రాన్స్‌జెండర్ల సమక్షంలో వివాహం ఘనంగా జరిగింది. ఈకార్యక్రమంలో హిజ్రాలు జానకమ్మ, దుర్గ, కీర్తి, అరుణ, వెన్నెల, వర్షిణి, లాలసనాకమ్మ పాల్గొన్నారు.

120 ఏళ్లనాటి మరగుజ్జు చెట్లు



మరుగుజ్జు చింతచెట్లు

ఏన్కూరు, జనవరి 21: 120 సంవత్సరాల నాటి మరగుజ్జు 'బోడు చింతల' విశేషం ఇది. ఏన్కూరు మండలం జన్నారం ఎస్సీ కాలనీలో రెండు చింత చెట్లు ఉన్నాయి. ప్రస్తుతం చింతచెట్లు ఉన్న ఎస్సీ కాలనీని కొన్నేళ్ల క్రితం అక్కడ నుంచి వేరే ప్రాంతానికి మారడంతో ఆప్రాంతం వ్యవసాయ క్షేత్రంగా మారింది. ఆరెండు చింతచెట్లు ఎదుగుబొదుగు లేకుండా ఉన్నాయి. వీటికి వచ్చే చింత చిగురును గ్రామస్థులు కోస్తూ ఉంటారు. వీటిని అక్కడివారు బోడుచింతలుగా పిలుస్తుంటారు. అటుగా వెళ్లేవారు మరుగుజ్జు చింతలను ఆసక్తిగాచూస్తున్నారు. మనుషుల్లోగానే చెట్లుకూడా మరుగుజ్జుగా ఉంటాయని జీన్స్ హార్మోన్స్ ప్రబావం వల్ల అరుదుగా ఉంటాయని గురుకుల కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకుడు శివకుమార్ తెలిపారు.

'ఎన్‌సీసీ ఏ' సర్టిఫికెట్ పరీక్షలు పూర్తి



పరీక్షకు హాజరైన క్యాడెట్లు

ఖమ్మం స్పోర్ట్స్, జనవరి 21: తెలంగాణ 11 ఎన్‌సీసీ బెటాలియన్ ఏ సర్టిఫికెట్ పరీక్షను ఆదివారం నగరంలోని క్రిష్ణప్రసాద్ మెమోరియల్ పాఠశాలలో నిర్వహించారు. ఏ సర్టిఫికెట్ కోసం నగరంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఈవెంట్లకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి 795 మంది హాజరయ్యారు. క్యాడెట్లకు మొదటి రోజు డ్రిల్ పరీక్షను నిర్వహించగా, రెండవరోజు రాత పరీక్షను నిర్వహించారు. ఎన్‌సీసీ పరీక్షలలో భాగంగా మొదటి సారిగా ఓఎమ్ఆర్ షీట్, ఎంసీక్యూ విధానంలో నిర్వహించారు. ఏ సర్టిఫికెట్ పరీక్షలను 11ఎన్‌సీసీ బెటాలియన్ కమాండెంట్ నవీన్‌యాదవ్ పలువురు ఎన్‌సీసీ అధికారులు సమీక్షించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

హామీలు నెరవేర్చండి

ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ వాళ్లు పారిపోయారు..

బీజేపీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి

ఖమ్మంబైపాస్‌రోడ్, జనవరి21: అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీజేపీ తమిళనాడు రాష్ట్ర సహ ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి అన్నారు. జిల్లా బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ప్రజలు ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎక్కడా కనబడడంలేదని, అధికారంలోకి రాకపోయేసరికే అదరు పారిపోయారని అన్నారు. పవర్‌సెక్టార్ స్కాం, కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం సీబీఐతో విచారణ జరిపించాలని, అందుకు అవసరమైతే బీజేపీకూడా సహకరిస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ వర్సెస్ బీజేపీఅని, బీఆర్ఎస్ ఎక్కడా కనబడదని అన్నారు. అనంతరం నగరంలోని ఎన్ఎస్‌పీ రామాలయంలో పరిసరాలను నాయకులతో కలిసి శుభ్రపరిచారు. ఈసమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ, దేవకి వాసుదేవరావు, శ్యాంరాఠోడ్, మంద సరస్వతి, విజయారెడ్డి, వెంకటనారాయణయాదవ్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

నిఘానేత్రాలు నిద్దరోతున్నాయ్

» ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రికార్డు కానీ సీసీ ఫుటేజీ

» పనిచేయని కెమెరాలు

» అత్యవసర సమయంలో ఇబ్బందులే



జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ప్రధాన ద్వారం వద్ద ఉన్న సీసీ కెమెరాలు





ఆర్ఎంవో గదిలో కెమెరా దృశ్యాలు


ఖమ్మం కలెక్టరేట్, జనవరి 21: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించడానికి ఏటా రూ.కోట్లు ఖర్చు చేస్తున్నారు. జిల్లా సర్వజన ఆస్పత్రిలో సిబ్బంది పనితీరు, ఆస్పత్రికి వచ్చే రోగులు, ఎవరెవరు వస్తున్నారు అనే అంశాలపై నిత్యం పర్యవేక్షించడం అసాధ్యం. ఈ నేపథ్యంలో సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పరిశీలించేందుకు సర్కారు తగిన ఏర్పాట్లు చేసింది. రోగులను నిర్లక్ష్యం చేయకుండా సేవలు అందించాలన్న లక్ష్యం, ఆస్పత్రి ఆవరణంలోకి ఏయే వాహనాలు వస్తున్నాయి. .ఎవరెవరు వస్తున్నారు.. రోగులను నిర్లక్ష్యం చేయకుండా సేవలు అందించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అయితే అవి పనిచేయకుండా నామమాత్రంగానే ఉన్నాయి. వీటినిర్వహణను అధికారులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా సీసీ కెమెరాల నిర్లక్ష్యం బహిర్గతం అవుతుంది. కొన్ని కొన్ని కీలక కేసుల సమయంలో సీసీ కెమెరాల ఫుటేజీ లేక పోలీసులకు, ఇటు ఆస్పత్రి అధికారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

పనిచేయని కెమెరాలు

జిల్లా సర్వజన ఆస్పత్రికి ప్రతి నిత్యం 2వేల మంది రోగులు వస్తుంటారు. వీరిలో 550 పడకలు, ఇన్‌పేషంట్లు వారికి సంబంధించిన కుటుంబీకులు, బంధువులు, ఇవే కాకుండా ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు ఇలా ప్రతి నిత్యం కనీసం 3వేల మందికి పైగానే ఆస్పత్రికి రాకపోకలు సాగుతుంటాయి. ఇవే కాకుండా వివిధ విభాగాల్లో అంటే క్యాజువాలిటీ, ఆస్పత్రి గుమ్మం సమీపంలో, ప్రదాన ద్వారాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘాను ఏర్పాటు చేశారు. మొదట్లో ఇవి పనిచేసినప్పటికీ క్రమేణా నిర్వహణ లోపం ఉన్నతాధికారులు పర్యవేక్షణ లోపంతో మూలన పడుతున్నాయి. వీటికి మరమ్మతులు కూడా నోచుకోవడం లేదు. దీంతో సీసీ కెమెరాలు నేత్రాలు పనిచేయడం లేదు. ఫలితంగా ఆస్పత్రుల్లో జరిగే సంఘటనలు బహిర్గతం అవ్వడం లేదు. జిల్లా సర్వజన ఆస్పత్రిలో గత ఆరు నెలల క్రితం ఓ ఆటో డ్రైవర్ ఓ మహిళను తీసుకొచ్చి క్యాజువాలిటీలో చేర్పించి వెళ్లిపోయాడు. సదరు మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. దీంతో ఆ మహిళ అత్యాచారానికి గురైందని ప్రచారం జరగడంతో పోలీసులకు సవాల్‌గా మారింది. ఈ కేసులో ఆస్పత్రిలో సీసీ ఫుటేజీ కోసం పోలీసులు, అటు ఆస్పత్రి అధికారులు నానా అవస్థలు పడ్డారు. అప్పట్లో ఆస్పత్రి అధికారులు, సిబ్బందిపైనా పలు ఆరోపణలు వచ్చాయి.

అలంకార ప్రాయమే..

ప్రస్తుతం ఉన్న సీసీ కెమెరాలు అలంకార ప్రాయంగానే ఉన్నాయని సమాచారం. ఇవి రికార్డింగ్ చేయడం లేదని లేదని పలువురు అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. కేవలం సీసీ ఫుటేజీలో చూపించడానికి తప్ప రికార్డింగ్ అవ్వడం లేదని తెలుస్తోంది. నిత్యం వేలాదిగా వచ్చే ఆస్పత్రిలో సీసీ కెమెరాలను ఇప్పటికైనా వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రత్యేక టెట్ నిర్వహించి పదోన్నతులు కల్పించాలి: ఎస్టీఎఫ్



ఖమ్మంఖానాపురంహవేలి, జనవరి21: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే టెట్ నిర్వహించి ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని ఎస్టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం సంఘం జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మానిఫెస్టోలో ప్రకటించిన విధంగా కాంట్రీబ్యూటరీపెన్షన్ విధానాన్ని రద్దు పరుచుటకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. విద్యార్థులస్థాయికి మించిన ఎఫ్ఎల్ఎన్ ఉన్నతి కార్యాక్రమాలను సమీక్షించాలన్నారు. ఉపాధ్యాయులపై పని ఒత్తిడి తగ్గించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మన్సూర్, మహబూబ్, తదితరులు పాల్గొన్నారు.

అంతారామమయం

జైశ్రీరాం నినాదాలతో మార్మోగిన నగరం

నేడే జమలాపురంలో రామయ్య కల్యాణం







నగరంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వీహెచ్‌పీ కార్యకర్తలు, వైరాలో ముస్తాబైన కోదండరామాలయం, తల్లాడలో వాహనాల భారీ ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

ఖమ్మంసాంస్కృతికం, జనవరి21: అయోధ్య రామాలయ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని ఖమ్మం నగరం రామనామమయంగా మారింది.. దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచల సమీప ప్రాంతం కావటంతో అయోధ్య రామాలయ ప్రారంభం హర్షాతిరేకాలు మిన్నంటుతున్నాయి... ప్రారంభోత్సవ కార్యక్రమం జయప్రదం కావాలని కోరుతూ ఆదివారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో రామభక్తులు భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. వీహెచ్‌పీ కార్యకర్తలు, నాయకులు రామ పతాకాలు చేబూని, కండువాలు ధరించి ర్యాలీ జరిపారు. అయోధ్య రామాలయ ప్రారంభోత్సవంపై ప్రజల్లో ప్రచారం జరిపేందుకు నగర వ్యాప్తంగా భారీ ఫ్లెక్సీలు, వాల్ పోస్టర్లు ఏర్పాటు చేశారు. సోమవారం అయోధ్యలో జరిగే రామాలయ ప్రారంభోత్సవ కవరేజ్‌ని లైవ్‌లో చూపేందుకు నగర ంలోని గాయత్రి భవనం తదితర చోట్ల భక్తులు ఏర్పాట్లు చేశారు. రామనామ సంకీర్తనలు, భజనలు,శాంతి కళ్యాణాలు, అన్నప్రసాద వితరణలు చేయనున్నారు. వివిధ దేవాలయాల్లో ప్రత్యేక పూజలతోపాటు ఇంటింటా దీపాలను వెలిగించనున్నారు.

తల్లాడలో వాహనాలతో భారీ ప్రచార ర్యాలీ

తల్లాడ: అయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకొని ఆదివారం తల్లాడ మండలంలో యువకులు వాహనాలతో భారీ ప్రచార ర్యాలీ నిర్వహించారు. మండలంలోని తల్లాడ, నారాయణపురం, మల్లవరం గ్రామాల్లో ర్యాలీ కొనసాగింది. మల్లవరం గ్రామంలోని సీతారామ కల్యాణమండపంలో సుందరకాండ హరికథ గానం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అల్పాహార ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

అష్ణగుర్తి ఆలయంలో హోమం

వైరా: మండలంలోని అష్ణగుర్తి ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం హోమాలు నిర్వహించారు. హనుమా అండనిలుమా అనే మగుటంతో శతాకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీరామ ముద్రణలను ప్రతి ఇంటికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్, ఉపసర్పంచ్ ఇటుకల మురళీ, గుమ్మా వెంకటేశ్వర్లు, సువిధా వికాస్ ట్రస్టు చైర్మన్ వెంపటి నాగేశ్వరరావు, సెక్రటరీ వేంసాని రవికుమార్ పాల్గొన్నారు.

నేడు సీతారాముల కళ్యాణం

ఎర్రుపాలెం: మండంలోని తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన జమలాపురంలో నేడు సీతారాముల కళ్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ సూపరిండెంట్ కె.విజయకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అయోధ్యలో శ్రీరాముని విగ్రహప్రతిష్ఠ జరుగుతున్న సందర్భంగా దేశవ్యాప్తంగా శ్రీరాముని పండుగ చేసుకుంటున్న పర్వదినాన సీతారాముల కళ్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిత్య కళ్యాణ శోభితుడైన శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో సీతారాముల కళ్యాణం నిర్వహించటం ఆలయ నిర్మాణానికి శుభసూచకమని తెలిపారు.

ప్రత్యేకాధికారుల పాలనలోకి పల్లెలు?

- 31తో ముగియనున్న సర్పంచ్‌ల పదవీకాలం
- మాజీలు కానున్న 589మంది
- ప్రత్యేకాధికారుల పాలన పెట్టే యోచనలో ప్రభుత్వం



మధిర, జనవరి 21: గ్రామపంచాయతీ సర్పంచ్‌ల పదవీకాలం ఈనెల 31తో ముగుస్తోంది. ఇప్పట్లో పంచాయతీ ఎన్నికలు జరిగే పరిస్థితులు కనిపించడంలేదు. దీంతో అనివార్యంగా పంచాయతీల పాలన ప్రత్యేక అధికారుల చేతుల్లోకి వెళ్లనున్నది. శాసనసభ ఎన్నికలు ఇటీవలనే ముగిశాయి. మరోవైపు లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పల్లెలకు ఎన్నికలు నిర్వహించడం సాధ్యమా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. మరో పది రోజుల్లో సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిపోతుంది. గ్రామపంచాతీ ఎన్నికలపై ఇటీవల అధికారులు హడావుడి చేసినా ఆతర్వాత కదలికలు ఆగిపోయాయి. ప్రభుత్వం నుంచి పంచాయతీ ఎన్నికల విషయంలో గ్రీన్ సిగ్నల్ రాకపోవడమే కారణంగా తెలుస్తోంది.

గడువులోపు ఎన్నికలు లేనట్టే...

పంచాయతీరాజ్ చట్టం ప్రకారం గడువులోగా ఎన్నికలు నిర్వహించకుంటే ప్రత్యేకాధికారులతో గ్రామాల్లో పాలన కొనసాగించాల్సి ఉంటుంది. గతంలో పదవీకాలం ముగిసినా పాత పాలకవర్గమే ఎన్నికలు జరిగే వరకు పర్సన్ ఇన్‌చార్జిలుగా కొనసాగేవారు. నూతన పంచాయతీ రాజ్ చట్టం నిబంధనలు దీన్ని అనుమతించవు. ఒకవేళా కొనసాగించాలంటే చట్టాన్ని సవరించాలి.. అందుకు శాసనసభ ఆమోదం తప్పనిసరి. ఈపరిస్థితుల్లో ప్రత్యేక అధికారుల పాలనవైపే ప్రభుత్వం మొగ్గుచూపుతోంది. అదీగాక ఎక్కువ పంచాయతీలు ఇప్పటికీ బీఆర్ఎస్ ఆధ్వర్యంలోనే ఉన్నాయి. కొత్తగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంతో పంచాయతీల్లోనూ కాంగ్రెస్ పాగా వేసేందుకు ప్రత్యేక అధికారుల పాలన కొంత మేరకు ఉపకరిస్తుందనే భావన కూడా వ్యక్తమవుతుంది. రిజర్వేషన్లు కూడా పాతవే కొనసాగిస్తారా లేక కొత్తగా రిజర్వేషన్లు అమలు చేస్తారా తెలియాల్సివుంది. గతంలో 2019 జనవరిలో గ్రామపంచాతీలకు ఎన్నికలు జరిగాయి. 2024 జనవరితో పదవీకాలం ముగుస్తుంది. గతఎన్నికల సమయంలో పంచాయతీరాజ్ చట్టాన్ని తీసుకొచ్చి రిజర్వేషన్లు అమలు చేశారు. ఈచట్టం రెండు పర్యాయాలు అమలులో ఉంటుంది. రాష్ట్రంలో ప్రభుత్వం మారినందున పాత విధానం ఉంటుందా.. లేక కొత్తగా మళ్లీ రిజర్వేషన్లు మారుస్తారా అనే స్పష్టత ప్రభుత్వం నుంచి రావాల్సివుంది. ఈ పరిస్థితుల దృష్ట్యా పంచాయతీల ఎన్నికలు ఇప్పట్లో జరగకపోవచ్చనే తెలుస్తోంది.

జిల్లాలో 589గ్రామ పంచాయతీలు

జిల్లాలో 589గ్రామపంచాయతీలుండగా అన్ని పంచాయతీలు ఈనెల 31తర్వాత ప్రత్యేక అధికారుల పాలనలోకి వెళ్లనున్నాయి. 589మంది సర్పంచ్‌లతోపాటు, వార్డు సభ్యులు పదవీ విరమణ చేయనున్నారు. మధిర నియోజకవర్గంలో మొత్తం 131గ్రామపంచాతీలు,1224వార్డులున్నాయి. మధిరలో 27, ఎర్రుపాలెంలో 31, బోనకల్‌లో22, చింతకానిలో 26, ముదిగొండలో 25పంచాయతీలు ఉన్నాయి.

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి

ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే

ఏన్కూరు, జనవరి21: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఐదురోజులపాటు జరిగిన జిల్లాస్థాయి క్రికెట్ ముగింపు పోటీల్లో పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు. ఈకార్యక్రమంలో సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, ఏబ్లాక్ అధ్యక్షుడు వేముల కృష్ణప్రసాద్, మండల అధ్యక్షుడు స్వర్ణనరేంద్రకుమార్, కొణిజర్ల ఎంపీపీ గోసు మధు, కాంగ్రెస్ పార్టీ మహిళ అధ్యక్షురాలు కొప్పుల ప్రభావతిరెడ్డి, నాయకులు యండ్రాతి సాయిరోహిత్, మాలోతు నరసింహారావు, శోభన్, చిన్నస్వామి,సైదులు, చంటి, పంతగాని నరేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భగవాన్‌నాయక్‌తండాకు ప్రథమ బహుమతి

భగవన్‌నాయక్‌తండా జట్టు ప్రథమ, ఏన్కూరు ద్వితీయ, తల్లాడ తృతీయ, నాలుగు, ఐదు ఏన్కూరుజట్లు విజేతగా నిలిచాయి.

వైరా: వైరాలో సంక్రాతి పండుగ సందర్భంగా నిర్వహించిన క్రికెట్ విజేతలకు ఆదివారం వైరా ఎమ్మెల్యే బానోతు రాందాస్‌నాయక్ బహుమతి ప్రధానం చేశారు. శ్రీ అయ్యప్పస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ నూతనకాని జైపాల్, మాజీ మార్కుఫైడ్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, పొదెల హరినాథ్, చెరుకూరి కిరణ్, దొడ్డ పుల్లయ్య, గంగారావు, మిట్టపల్లి నాగి, కౌన్సిలర్ లక్ష్మం బాయ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని పరిశీలించిన ఆర్డీవో

ముదిగొండ, జనవరి 21: ముదిగొండలోని జడ్పీఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ఖమ్మం ఆర్డీవో గణేష్ ఆదివారం పరిశీలించారు. అలాగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఎంతమంది ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీటీ రెహ్మాన్, ఆర్ఐ వహీదా, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పోలింగ్‌బూతులను పరిశీలించిన తహసీల్దార్

వైరా: వైరా మండలంలో ఆదివారం ఓటర్ల చేర్పుల కోసం నిర్వహించిన కార్యక్రమాన్ని తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు సందర్శించి పరిశీలించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ప్రత్యేక ఓటుహక్కు నమోదు పోలింగ్ బూతులను సందర్శించి పరిశీలించారు. అలాగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అర్హులైన వారు ఓటుహక్కు నమోదు ప్రక్రియను కూడా పరిశీలించారు.

నేలకొండపల్లి: రెండు రోజులుగా కొనసాగుతున్న ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. మండల వ్యాప్తంగా శనివారం ఎమ్మెల్సీ ఓట్ల కోసం 70 మంది దరఖాస్తు చేసినట్లు అధికారులు చెప్పారు. తహసీల్దార్ అనురాధాబాయి, ఎమ్మారైలు ఆలస్యం మధుసూధనరావు, మాధవిలు మండలంలోని బూతుల్లో జరుగుతున్న ఓటర్ నమోదు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

సత్తుపల్లిరూరల్: ఈనెల 6వ తేదీన ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేయగా నేటితో అభ్యంతరాలు స్వీకరణకు ఆఖరని సత్తుపల్లి తహసీల్దార్ యోగీశ్వరరావు తెలిపారు. ప్రత్యేక ఓటరు నమోదును ఆయన ఆదివారం సత్తుపల్లి మునిసిపాలిటీలోని జడ్పీహెచ్ఎస్, ఎన్టీఆర్ నగర్ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.

వేంసూరు: ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఓటర్ల నమోదు కేంద్రాన్ని ఆదివారం తహసీల్దార్ రాజు సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

విద్యుత్ సర్వీసు అనుమతి పత్రాలపై తాత్సారం

కలెక్టర్ ఆదేశాలను పాటించని గ్రామ కార్యదర్శులు

కల్లూరు, జనవరి22 విద్యుత్ కనెక్షన్లు లేని గృహాలకు కనెక్షన్లు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించిన కల్లూరు మండలంలోని పలు గ్రామాల పంచాయితీ కార్యదర్శిలు పట్టించుకోవటం లేదు. మండలంలోని చిన్నకోరుకొండి గ్రామ పంచాయితీ పరిధిలో గల చిన్నకోరుకొండి, దారుగాబంజరు గ్రామాలలోని పలు కుటుంబాలకు సంబంధించి పలువురు నూతనంగా విద్యుత్ సర్వీసుల కోసం పంచాయితీ వారిని సంప్రదించారు. అందుకు భిన్నంగా వ్యవహరిస్తూ నిరాకరిస్తున్నట్లు పలువురు భాధితులు తెలిపారు. ఒక కుటుంబంలో కుమారులకు వివాహం కాగా వారు వేరే కాపురం పెట్టారు. అలాంటి వారు కొత్తగా విద్యుత్ సర్వీసు మీటర్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. దరఖాస్తుదారుడు సదరు నెంబరు గల గృహంలో కాపురం ఉంటున్నట్లు అనుమతి పత్రం ఇవ్వాల్సి ఉంది. అయితే గ్రామ పంచాయితీ కార్యదర్శిలు ససేమిరా అంటున్నారు. దారుగ బంజరు గ్రామానికి చెందిన కనమతిరెడ్డి రమేష్ రెడ్డితో పాటుగా పలువురు దరఖాస్తు చేసుకుంటే కారదర్శి ఇబ్బందులకు గురిచేస్తూ, తమకు ఎలాంటి జీవో అందలేదని నిర్లక్ష్యంగా సమాధనం చెప్తున్నారని తెలిపారు. ఇంటి నెంబరు ఉండి ఇల్లు పేరు తండ్రి పేరు కుటింబీకుల పేరుతో ఉన్న కారణంగా మీటర్లు ఇవ్వని చోట వెంటనే మీటర్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఇటీవల కలెక్టర్ కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో జరిపిన సమీక్ష సమావేశంలో స్పష్టం చేశారు. ఇప్పటికైన జిల్లా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుప్రమాదంలో గాయాలు

నేలకొండపల్లి, జనవరి21: మండల పరిధిలోని గువ్వలగూడెం గ్రామం వద్ద ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఖమ్మం ప్రకాష్‌నగర్‌కు చెందిన ఎస్.మధు అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. గువ్వలగూడెం వద్ద ఖమ్మం వైపు వెళుతున్న కారు వెనుక నుంచి ఆటోను ఢీకొట్టగా , ఆ వాహనం ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనం నడుపుతున్న మధు తీవ్రంగా గాయపడ్డాడు. ఆటోలో ఉన్న వారికి ఎటువంటి గాయాలు కాలేదు.

వలస కూలీలకు దుప్పట్లు పంపిణీ

కొణిజర్ల, జనవరి21: చేతన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని రాంపురంలో వలస వచ్చిన కూలీలకు ఆదివారం దుప్పట్లను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో జైలర్ కరణం, సురేష్, కిరణ్, ఉపేందర్, సత్యనారాయణ, భువన్, ఈశ్వర్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి సైన్స్, గణిత వైజ్ఞానిక మూల్యాంకనం పూర్తి

ఖమ్మంఖానాపురంహవేలి, జనవరి 21: జిల్లాలో వివిధ ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలల విద్యార్థుల నుంచి వచ్చిన అయిదు అంశాలపై సృజనాత్మక ఆలోచనలతో నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్, గణిత వైజ్ఞానిక ఆన్‌లైన్ మూల్యాంకనం ఆదివారంతో పూర్తియిందని డీఈవో సోమశేఖర శర్మ తెలిపారు. మెత్తం 187 ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు వచ్చాయని, వీటిని 8మంది ప్రధానోపాధ్యాయులు న్యాయ నిర్ణేతలుగా ఉండి మూల్యాంకణం పూర్తిచేశారని తెలిపారు. సీనియర్, జూనియర్లు వేర్వేరుగా ప్రథమ, ద్వితీయ, తృతియ స్థానాలు ఎంపిక చేశారని చెప్పారు. ప్రథమస్థానం పొందిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామన్నారు. మెత్తం పర్యవేక్షణ జిల్లా సైన్స్ అధికారి జగదీశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు చెప్పారు.

విద్యారంగ అభివృద్ధికి కృషి చేయాలి

ఖమ్మంఖానాపురంహవేలి, జనవరి21: టీపీటీఎఫ్ రాష్ట్రమహాసభల్లో విద్యారంగంపై చర్చించి, అభివృద్ధికి కృషి చేయాలని డీఈవోకి సంఘం నాయకులకు సూచించారు. ఆదివారం సంఘం రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ప్రపంచ మానవాళి విముక్తి కోసం పనిచేసిన లెనిన్

- శతవర్ధంతి సభలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు

ఖమ్మంసంక్షేమవిభాగం,జనవరి21: ప్రపంచ మానవాళి విముక్తి కోసం తొలి సోషలిస్టు రాజ్యాన్ని సాధించిన మహాయోధుడు లెనిన్ అని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మిరియం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆదివారం సుందరయ్య భవన్‌లో రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన లెనిన్ శత వర్ధంతి సభను నిర్వహించారు. ఎం.సుబ్బారావు, వై.విక్రమ్, బండారు రమేష్, విద్యావేత్త ఐవీ రమణారావు, భారవి పాల్గొన్నారు.

లెనిన్ మార్గం సదా అనుసరణీయం: బాగం

లెనిన్ మార్గం ప్రపంచ మానవాళికి సదా అనుసరణియమని, ప్రజా సమస్యలకు కమ్యూనిజమే పరిష్కార మార్గమని సీపీఐ జాతీయ కమిటీ సభ్యులు బాగం హేమంతరావు పేర్కొన్నారు. గిరిప్రసాద్ భవన్‌లో నిర్వహించిన లెనిన్ శత వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, కొండపర్తి గోవిందరావు, శింగు నర్సింహారావు, సీతామహాలక్ష్మీ, మేకల శ్రీనివాసరావు, రావి శివరామకృష్ణ, తాటి నిర్మల, గాదే లక్ష్మీనారాయణ, ఇటికాల రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రజాపంథా ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో

కార్మికవర్గ విప్లవం సాధించటానికి లెనిన్ జీవితం స్ఫూర్తిగా తీసుకోవాలని ప్రజాపంథా జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో లెనిన్ శత వర్ధంతి సభను నిర్వహించారు. పెట్టుబడిదారి రాజ్యాన్ని మార్చి కార్మిక వర్గాన్ని పేద ప్రజల ఆర్థికాభివృద్ధికి కృషి చేశారన్నారు. జీ రామయ్య, ఆవుల అశోక్, శిరోమణి, ఆజాద్, వెంకటటేష్, సత్తార్మియా, ప్రసాద్, అనిత, లక్ష్మి పాల్గొన్నారు.

ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దు

వైరా, జనవరి 21: జన్యుపరమైన ఆరోగ్య సమస్యలను ఎప్పుడూ నిర్లక్ష్యం చేయవద్దని ప్రముఖ వైద్యుడు చీకటి భారవి స్పష్టం చేశారు. వైరాలో ఆదివారం బోడేపూడి కళానిలయం సంస్థ కార్యదర్శి బొంతు రాంబాబు పర్యవేక్షణలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో డాక్టర్లు భారవి, నవ్య, జట్ల రంగారావు, పిల్లలమర్రి సుబ్బారావు రోగులను పరీక్షించారు. మాజీ ఎంపీపీ బొంతు సమత, తోట నాగేశ్వరరావు, మాదినేని రజిని, గుడిమెట్ల మోహన్‌రావు, అనుమోలు రామారావు, మల్లెంపాటి ప్రసాద్, శీలం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సునీతాదేవి కుటుంబానికి నందిని పరామర్శ

తిరుమలాయపాలెం,జనవరి21:మండలంలోని బచ్చోడు గ్రామ మాజీ సర్పంచ్ రామసహాయం సునితేదేవి కుటుంబ సభ్యులను ఆదివారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని, డీసీసీ అధ్యక్షడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, పీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు, మాజీఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు పరామర్శించారు. కుటుంబసభ్యులు అరవిందరెడ్డి, హరితారెడ్డిలను పరామర్శించారు. ఈకార్యక్రమలో జడ్పీటీసీ బెల్లం శ్రీను, నాయకులు వేముల ఉపేందర్, బోడ సుదర్శన్, సర్పంచ్‌లు లింగన్న, రాజు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

వైరా,జనవరి21:యూటీఎఫ్ వైరా మండల కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. వైరాలో జరిగిన యూటీఎఫ్ మండల మహాసభలో జిల్లా అధ్యక్షుడు జీవీ. నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా బొగ్గుల శ్రీనివాసరెడ్డి, కార్యదర్శిగా జి. రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా అనిత, సైదులు, కోశాధికారిగా హన్మంతరావు, కార్యదర్శులుగా సుశీల, జీవీ.కృష్ణారావు, భాస్కర్ రావు, చైతన్యభారతి, నరేష్ కుమార్, డి.కృష్ణారావు, ఆడిటర్‌గా సర్వర్‌బాబు, జిల్లా ప్రతినిధులుగా సరస్వతీ, రామకృష్ణ, శ్రీనివాసులు, మహిళా కమిటీ కన్వీనర్‌గా జరీనా, క్రీడాకమిటీ కన్వీ నర్‌గా వి.చంద్రశేఖర్, సాంస్కృతిక కమిటీ కన్వీనర్‌గా రామలక్ష్మీ, సోషల్ మీడియా కన్వీనర్‌గా వాసు, అకడమిక్ కమిటీ కన్వీనర్‌గా వెంకటేశ్వరరావును ఎన్నుకున్నారు.

మధిరటౌన్: మధిర మండల నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. టీపీఎం పాఠశాలలో జరిగిన మండల మహాసభలో నూతన అధ్యక్ష, కార్యధర్శులుగా ఏ.వినోదరావు, ఇ.వీరయ్యను ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే ఉపేక్షించం

సత్తుపల్లిరూరల్,జనవరి21: నంబర్ ప్లేట్లు లేకపోయినా, మద్యం సేవించి వాహనం నడిపినా ఉపేక్షించేది లేదని సత్తుపల్లి రూరల్ ఎస్ఐ కుశకుమార్ అన్నారు. ఆదివారం సత్తుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో పలు ప్రాంతాలలో వాహనాల తనిఖీ, చలాన్లు, ధ్రువపత్రాల పరిశీలన, డ్రంక్ అండ్ డ్రైవ్‌పరీక్షలు నిర్వహించారు. నిబంధనలు పాటింకపోతే చర్యలు తప్పవన్నారు. తనిఖీలో పోలీస్ సిబ్బంది ఎంవీ. సత్యనారాయణ, నరేష్, శ్రీనివాస్, కరుణాకర్ ఉన్నారు.

లెనిన్ స్ఫూర్తితో ముందుకు తీసుకుపోవాలి

వైరా,జనవరి21: లెనిన్ స్ఫూర్తితో సోషలిజాన్ని ముందుకు తీసుకుపోవాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు సీవై.పుల్లయ్య పిలుపునిచ్చారు. ఆదివారం వైరాలో నిర్వహించిన లెనిన్ శతవర్ధంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో పార్టీ డివిజన్ కార్యదర్శి కె.అర్జున్‌రావు, యలదండి బాబు, డి.శిరీష, కె.దర్గయ్య, గడ్డం లక్ష్మణ్, సోములు, నున్నావత్ శ్రీను, రమేష్, భూక్యా శ్రీను,ఐలయ్య పాల్గొన్నారు.

గుండెపోటుతో సీపీఎం నాయకుడు మృతి

తిరుమలాయపాలెం, జనవరి21: మండలంలోని పిండిప్రోలు గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు రామనబోయిన రామస్వామి(60) ఆదివారం గుండెపోటుతో మృతిచెందాడు. ఇంటిలో ఉండగా ఒక్కసారిగా గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయాడు. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

దూర విద్యాకేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కోఆర్డినేటర్

వైరా, జనవరి21: వైరా ఠాగూర్ విద్యాలయంలోని దూర విద్యాకేంద్రాన్ని జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు ఆదివారం సందర్శించి పరిశీలించారు. చదువు మానేసిన వారికి ఈ దూర విద్యాకేంద్రం ద్వారా చదువుకునే అవకాశాన్ని కల్పిస్తుందని తెలిపారు. ప్రతి ఆదివారం తరగతులకు హాజరై మంచి మార్కులు సాధించి భవిష్యత్‌లో ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకోవాలని సూచించారు. ఠాగూర్ విద్యాకేంద్రం కోఆర్డినేటర్ సంక్రాంతి రవికుమార్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ కృష్ణారావు, కౌన్సిలర్స్ లింగారావు, నాగలక్ష్మీ, మజీద్ పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని ప్రారంభించిన కొండబాల



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న కొండబాల

వైరా,జనవరి 21: మండలంలోని రెబ్బవరం గ్రామంలో హెల్పింగ్ హ్యాండ్స్ కుటుంబసభ్యులు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులైన ఖమ్మం వాస్తవ్యులు కొంగర పురుషోత్తమరావు, బిక్కసాని వెంకటరత్నం రూ.పది లక్షలతో నిర్మించిన గ్రంథాలయాన్ని మాజీఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. పరామర్శించారు. తల్లిదండ్రులు బిక్కసాని నర్సయ్య, మంగమ్మ జ్ఞాపకార్థం బిక్కసాని వెంకటరత్నమ్మ ఈ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయటం శుభపరిణామని కొండబాల అభినందించారు. రెబ్బవరం సర్పంచ్ సాదం రామారావు, ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వరరావు, బిక్కసాని సీతయ్య, దామోదర్‌రావు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మోత్కూరి మధు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ దాసరి దానియేలు, సయ్యద్ షఫీ, వెలిశెట్టి నర్సింహారావు, కొండబోలు వెంకటేశ్వరరావు, గుత్తా శ్రీనివాసరావు, బత్తుల వెంకటేశ్వర్లు, ప్రసాదరావు, త్రిపురనేని జానకీబోసు, చావా రమేష్ పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం కేలండర్ ఆవిష్కరణ



ఖమ్మంచర్చికాంపౌండ్, జనవరి21: జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం హైదరాబాదులోని మినిస్టర్ క్వార్టర్స్‌లో ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో పద్మశాలి సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమర్తపు మురళి, జిల్లాప్రధాన కార్యదర్శి చిలకమర్రి శ్రీనివాసబాబు, పెండెం జనార్ధన్, బండారు శ్రీనివాస్, దుస్సా సత్యనారాయణ, పిల్లలమర్రి కొండలరావు, పులిపాటి సంపత్‌కుమార్, చందా వీరభద్రం పాల్గొన్నారు.

నరసింహస్వామి దేవాలయంలో పొంగులేటి పూజలు

ఖమ్మంసాంస్కృతికం, జనవరి20: రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం ఖమ్మంలోని స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని సందర్శించారు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు శాలువాతో సన్మానించారు. తీర్థప్రసాదాలు అందించారు.

నేడు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల పర్యటన

రఘునాథపాలెం, జనవరి21: వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం రఘునాథపాలెం మండలంలో పర్యటించనున్నారు. కేవీ బంజర, పంగిడి, కోయచెలక గ్రామాల్లో పర్యటించనున్నారు. ఈర్లపూడి గ్రామ పంచాయతీలో నిర్వహించే కళ్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి తుమ్మల పాల్గొనున్నారు. ఈ మేరకు వివరాలను కలెక్టర్ వీపీ గౌతమ్ సంబంధిత ప్రభుత్వశాఖల అధికారులకు ఆదేశాలు పంపారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన ప్రాజెక్టులు

ఖమ్మంఖానాపురంహవేలి, జనవరి21: జూనియర్ విభాగంలో ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్ ఖమ్మం 9వ తరగతి విద్యార్థి తయ్యారు చేసిన ప్రాజెక్ట్, సీనియర్స్ విభాగంలో రెజోనెన్స్ పాఠశాల విద్యార్థిని శ్రీవల్లి తయ్యారు చేసిన బేబీ మానిటరింగ్ సిస్టం, ఉపాధ్యాయుల ఎక్స్‌బీట్‌లో నగరంలోని ఆర్ఆర్ పాఠశాల ఉపాధ్యాయుడు మీరా హబీబ్ బయోసైన్స్ మెడల్స్‌లు ఎంపికైనట్లు డీఈవో తెలిపారు.

జాతీయ ఉపాధ్యాయ వర్క్‌షాపులో పాల్గొన్న ఉపాధ్యాయుడు

కొణిజర్ల, జనవరి21: హర్యానాలోని హరిదాబాదులో జరిగిన జాతీయ ఉపాధ్యాయ వర్క్‌షాపుకు కొణిజర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు హనుమ హాజరయ్యాడు. వర్క్‌షాపు ముగిసిన తర్వాత ఆదివారం తన అనుభవాలను పంచుకున్నాడు. ఈ కృత్యాలు తరగతి గదిలో విద్యార్థులకు అన్వయించటానికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి ఎంతో మంది డెలిగేట్స్ వచ్చారని, వారి అనుభవాలను నేర్చుకోవడం జరిగిందన్నారు.